

మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్.



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY



విలేకరులు కావలెను

శ్రీచక్ర




ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలు, తాలుకా, మండలాల్లో శ్రీచక్ర తెలుగు దినపత్రికలో SREECHAKRA NewsTV ల్లో వార్తల సేకరణకు విలేకరులు కావలెను. జర్నలిస్టుగా రాణించాలనుకునేవారికి అవకాశం.. ఆసక్తి గల వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

మీ..
డాక్టర్ హరినాథరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్
9848334101
8333000509



సంపుటి 10 | సంచిక 61 | కర్నూలు | మంగళవారం 25 మార్చి 2025 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi


# నేటినుంచి రెండురోజులు కలెక్టర్ల సదస్సు

### ప్రభుత్వం పథకాలు...వివిధ అంశాలపై చర్చ
### ప్రారంభ ఉపన్యాసం చేయనున్న సిఎం చంద్రబాబు


అమరావతి,మార్చి24(శ్రీచక్ర) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, కార్యక్రమాలు ప్రజలకు చేరవేసేందుకు మరింత పకడ్బందీగా ముందుకు తీసుకుని వెళ్లాలని ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ క్రమంలో రెండురోజుల పాటు అమరావతిలో కలెక్టర్ల సదస్సు నిర్వహించనుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల సదస్సు నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం భావించింది.. దీనిలో భాగంగా ఇప్పటికే కుటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక రెండు సార్లు కలెక్టర్ల సదస్సు నిర్వహించిన ప్రభుత్వం.. రెండు రోజులు పాటు మరోసారి సదస్సు నిర్వహిస్తోంది.. వచ్చే ఏడాది నాటికి 15 శాతం వృద్ధి సాధనే లక్ష్యంగా మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటుకలెక్టర్ల సదస్సు నిర్వహించనుంది. ఇందులో వివిధ పథకాల అమలు, శాంతిభద్రతలు, వేసవి తాగునీటి సమస్య మొదలు అనేక అంశాలను చర్చించనున్నారు. సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఈ సదస్సు జరగనుంది.. గతానికి భిన్నంగా కలెక్టర్ల సదస్సు నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే వేసవి కాలంలో తాగునీటి సమస్య, పశు గ్రాసం, పశువులకు తాగునీటి లభ్యత, సీజనల్ వ్యాధుల నివారణ, ఉపాధి హామీ పథకం పనులు వంటి అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. పి.ఫోర్ కార్యక్రమంపై ప్రత్యేక చర్చ జరగనుంది.. రాష్ట్రంలో రాబోయే ఆరు నెలల్లో తీసుకోవాల్సిన చర్యలు.. పాలనలో మార్పులు.. పీ 4 సంక్షేమ పథకాలు ప్రధాన అజెండాగా రెండు రోజుల పాటు– కలెక్టర్ల సమావేశం జరగనుంది. పీఎం సూర్య ఘర్ పేరుతో ప్రతి నియోజకవర్గంలో 10 వేల ఇళ్లపై రూఫ్ టాఫ్ లు ఏర్పాటు– చేయడంపై కూడా ప్రభుత్వం ఈ సదస్సులో ఫోకస్ పెట్టింది.. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు కార్యాచరణ పై నివేదికలు సిద్ధం అయ్యాయి. 15 శాతం వృద్ధే లక్ష్యంగా రానున్న ఏడాది కాలానికి రాష్ట్రంలోని 26 జిల్లాల కార్యాచరణ ప్రణాళికలను రెండు రోజుల పాటు– అమరావతిలో జరిగే కలెక్టర్ల సమావేశంలో ఆవిష్కరించనున్నారు.. రెండు రోజుల ఈ సమావేశంలో మొదటి రోజు




9,రెండో రోజు 17 జిల్లాల కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తారు.. ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రజెం–టె–షన్ ఇవ్వనున్నారు.. ప్రతి జిల్లాకు 20 నిమిషాలు కేటాయించారు.. ఇందులో 10 నిమిషాలు కార్యాచరణ ప్రెజెంటేషన్, ఐదు నిమిషాలు సమస్యల వివరణ, ఇంకో ఐదు నిమిషాలు వాటిపై చర్చించనున్నారు.. తమ జిల్లాల్లో వివిధ సమస్యలను కలెక్టర్లు ప్రభుత్వ దృష్టికి తీసుకురానున్నారు. మొదటి రోజు భూముల వ్యవహారాలు, భూ సర్వేపై సీపీఎల్ఏ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.. ఇప్పటికే రాష్ట్రంలో గత 5ఏళ్ల అనేక అక్రమాలు జరిగాయని భావించిన ప్రభుత్వం.. భూ అక్రమాలు చోటు–చేసుకున్న జిల్లాలలో జిల్లా ఇంచార్జ్ మంత్రులు నుండి నివేదికలను గత సమావేశంలో కోరారు.. ఈ సమావేశంలో వాటిపైన చర్చిం చనున్నారు.. వీటితో పాటు– నగర వనాలు, పచ్చదనం, ఎకో టూరిజంవంటి అంశాలపై అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.. సంక్షేమ పథకాల అమలుపై ఆయా శాఖల కార్యదర్శుల ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.. పీ4 కార్యక్రమంపై ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి వివరించనున్నారు.

# ఏపీ ఉద్యోగులకు శుభవార్త

అమరావతి, మార్చి24(శ్రీచక్ర) ): ఏపీ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు తీపి కబురు అందించింది. ఉద్యోగుల బకాయిలను వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్టు ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం రూ. 6,200 కోట్లు విడుదల చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిధులు విడుదల అవుతున్నాయి. నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి మంగళవారం లేదా బుధవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో నిధులు విడుదల అవుతాయని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. బకాయిలు జమ అవుతున్నాయని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నేతలు ఈ మేరకు ధృవీకరించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల విడుదలకు సీఎం నారా చంద్రబాబు నాయుడు శు



క్రవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు

# పార్లమెంట్ సభ్యుల వేతనాలు పెంపు



న్యూఢిల్లీ:(శ్రీచక్ర) పార్లమెంట్ సభ్యుల జీతాలు, డైలీ అలవెన్సెస్,పెన్షన్, అదనపు పెన్షన్‌లలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. వాటిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుల జీతం లక్ష రూపాయలుగా ఉంది. దాన్ని ఏకంగా లక్షా 24 వేలకు పెంచింది. డైలీ అలవెన్సెస్‌ను 2వేల నుంచి 2,500లకు పెంచింది. పెన్షన్ విషయానికి వస్తే.. మాజీ సభ్యులకు ప్రతీ నెల 25 వేల పెన్షన్ అందుతోంది. దాన్ని 25 వేలనుంచి 31 వేలకు పెంచింది. మాజీ సభ్యుల అదనపు పెన్షన్‌లోనూ మార్పులు చేసింది. దాన్ని 2 వేల నుంచి 2,500లకు పెంచింది. ఈ పెంపు ఏప్రిల్ 1, 2023నుంచి అప్లై అవుతుంది.కొద్దిరోజుల క్రితమే కర్ణాటక ప్రభుత్వం.. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలను పెంచింది. అది కూడా 100 శాతం జీతాలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నెల జీతం లక్ష ఉంటే.. పెంచిన జీత ప్రకారం 2 లక్షలు అవుతుంది. కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అసెంబ్లీలో రచ్చకు దారి తీసింది. ప్రతి పక్షాలు దీన్ని తీవ్రంగా తప్పుబట్టాయి. ప్రభుత్వంలోని వారు మాత్రం దీన్ని సమర్థించుకుంటు న్నారు. కర్ణాటక హోం మినిస్టర్ జి. పరమేశ్వర దీనిపై మాట్లాడుతూ.. ' సాధారణ ప్రజల ఖర్చులు పెరుగుతున్నట్లే.. ప్రజా ప్రతినిధుల ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. సాధారణ పౌరుడిలాగే.. ఓ ఎమ్మెల్యే కూడా ఇబ్బందిపడుతున్నాడు. ఎమ్మెల్యేలతో పాటు ఇతరులనుంచి కూడా ప్రతి పాదనలు వచ్చాయి.

# ఉగాది సందర్భంగా పీ4 ప్రారంభం

### పేదలకు అండగా నిలవడమే లక్ష్యం
### పీ4పై చంద్రబాబు సమీక్ష



అమరావతి,మార్చి24(శ్రీచక్ర) : ఉగాది సందర్భంగా అమరావతిలో పీ4 ప్రారంభం అవుతుందని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సాయం అందించే చేతులకు వేదిక పీ4 అని అన్నారు. సంపన్నులు – పేదలను ఒకేచోటకు చేర్చడమే దీని లక్ష్యమని తెలిపారు. ఎన్నారైలతో సహా స్వచ్ఛందంగా ఎవరైనా ముందుకురావొచ్చని కోరారు. పబ్లిక్–ప్రైవేట్–పీపుల్ పార్టనర్‌షిప్ పీ4 పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీ4 విధానానికి తుదిరూపు ఇచ్చారు. పేదలకు అండగా నిలిచేవారు మార్గదర్శకులని, లబ్ధి పొందేది బంగారు కుటుంబం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనున్నదని తెలిపారు. 2029 కల్లా పేదరికాన్ని నిర్మూలించాలనేది ప్రభుత్వ సంకల్పమని సీఎం స్పష్టం చేశారు. సంపన్నులు–పేదలను ఒకే చోటకు చేర్చడమే లక్ష్యంగా పీ–4 విధానాన్ని రూపొందించినట్లు చంద్రబాబు తెలిపారు. అ విధానంలో భాగస్వాములు కావడానికి ఎన్నారైలతో సహా ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు రావొచ్చన్నారు. ఈ విధానం అమలు తీరుపై సీఎం స్పష్టత ఇచ్చారు.

# తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక..

హైదరాబాద్,(శ్రీచక్ర) గత కొద్దిరోజుల నుంచి వాతావావరణంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వారం రోజుల ముందు వరకు ఎండలు దంచికొట్టాయి. 40 డిగ్రీలకుపైనే ఎండలు పెట్టాయి. కానీ, ఇప్పుడు మాత్రం ఎండలు బాగా తగ్గాయి. అప్పుడప్పుడు వర్షాలు కూడా పడుతున్నాయి. అకాల వర్షాల కారణంగా రైతులు అల్లాడిపోతున్నారు. పంటనష్టం సంభవిస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత వాతావరణ శాఖ తెలుగు రాష్ట్రాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. వచ్చే మూడు రోజులు తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. అంతేకాదు.. తెలంగాణ వ్యాప్తంగా ఈ రోజు వర్షం పడే అవకాశం ఉందని వెల్లడించింది. అసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు,భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, వరంగల్, జనగామ, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్‌తో పాటు మిగిలిన జిల్లాలకు కూడా ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వర్షాలు తగ్గిన తర్వాత మళ్లీ ఎండలు దంచికొడతాయని, 2–3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని అంది. ఉత్తర కోస్తా , యానాంలలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది. రేపు, ఎల్లుండి పొడి వాతావరణం ఉంటుందని వెల్లడించింది.




తర్వాతినుం చి ఎండలు మరింత పెరుగుతాయని పేర్కొంది. దక్షిణ కోస్తా, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఒకటి రెండు చోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. తర్వాతినుంచి ఎండలు పెరుగుతా యి.ఇక, రాయలసీమలోనూ ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది. రేపటి నుంచి ఎండలు రెండు, మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది. కాగా, అకాల వర్షాలు, వడగండ్ల వాన కారణంగా వివిధ జిల్లాల్లో జరిగిన పంటనష్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు.

# పంట నీటి కుంటలను నిర్మించి సద్వినియోగం చేసుకోండి

### జిల్లాలో దాదాపు 3 వేల నీటి కుంటల ఏర్పాటుకు శ్రీకారం
### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా





నంద్యాల, మార్చి, 22(శ్రీచక్ర) :–పంటకు అవసరమయ్యే నీటిని నీటి కుంటల ద్వారా సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రైతులను సూచించారు. శనివారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నీటి కుంటల ప్రారంభిస్తున్న సందర్భంగా మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పంట నీటి కుంటల కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. డ్వామా పిడి వెంకటసుబ్బయ్య తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకొని పంటలకు అవసరమయ్యే నీటిని నీటి కుంటల ద్వారా సమకూర్చుకోవాలని రైతులను సూచించారు. నీటి గుంటల కింద కూరగాయల సాగును కూడా చేపట్టవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నీటి కుంటలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో నంద్యాల జిల్లాలో 3 వేల వరకు నీటి కుంటలు ఏర్పాటు చేసే దిశగా లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. జిల్లాలో 1/3 వంతు భూములు ఉపరితళంగా ఉండడం, ఆర్ఓఎఫ్ఆర్ భూములు ఉన్న కారణంగా కమ్యూనిటీ ఫామ్ పాండ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో జిల్లాలోని రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లాలో 3 మీటర్ల నుండి 25 మీటర్ల లోతు వరకు నీటి సాంద్రత ఉన్న గ్రామాలు ఉన్నందున మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో పెద్ద ఎత్తున నీటి కుంటలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే వేతనదారులు కూడా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉదయాన్నే పనులకు త్వరగా వచ్చి ఉ.11 గంటల లోపు ముగించుకొని వెళ్లేలా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉపాధి హామీ వేతనదారులకు ప్రభుత్వం నుండి రావాలసిన సహాయ, సహకారాలు అందుతాయని కలెక్టర్ తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల సూచనల మేరకు ఉపాధి హామీ పనులు సక్రమంగా పూర్తి చేసిన వారికి రోజుకు మూడు వందల రూపాయల వరకు వేతనం రావడం జరుగుతుందన్నారు.

# ప్రధాని మోదీ ఆ సమస్యపై కూడా మాట్లాడాలి : రాహుల్‌గాంధీ




న్యూఢిల్లీ:(శ్రీచక్ర) ప్రధాని నరేంద్రమోదీ పైన, బీజేపీమాతృసంస్థ ఆరెస్సెస్‌పైన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. దేశంలోని ఓ సంస్థ భారతదేశ భవిష్యత్తును, దేశంలో విద్యావ్యవస్థను ఖతం చేయాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ఆ సంస్థ మరేదో కాదని, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అని ఆయన చెప్పారు.ఒకవేళ భారత విద్యావ్యవస్థ క్రమంగా ఆరెస్సెస్ చేతుల్లోకి వెళ్తే దేశం పూర్తిగా నాశనమవుతుందని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో ఎవరికీ ఉద్యోగాలు రావని, దేశం పని ఖతమవుతుందని వ్యాఖ్యానించారు. దేశ రాజధాని ఢిల్లీలో ఔజఎ నిరసన కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. అన్ని విద్యార్థి సంఘాలు కార్యక్రమానికి వచ్చినందుకు తనకు సంతోషంగా ఉందని చెప్పారు. దేశంలో ఏం జరుగుతుందో విద్యార్థులకు చెప్పాల్సిన బాధ్యత విద్యార్థి సంఘాలపైనే ఉందన్నారు.దేశంలోని అన్ని యూనివర్సిటీల వైస్ ఛాన్సెలర్స్‌లో ఆరెస్సెస్ ఆధిపత్యం ఉన్నదని రాహుల్‌గాంధీ చెప్పారు. ఇక ముందు రాష్ట్రాల్లోని యూనివర్సిటీలకు వీసీలను కూడా ఆర్ఎస్ఎస్ నామినేట్ చేసే రోజులు రాబోతున్నాయని అన్నారు. ఇది దేశానికి చాలా ప్రమాదకరమని, అలా జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. ప్రస్తుతం దేశంలో నిరుద్యోగ సమస్య ప్రధాన సమస్యగా ఉన్నదని రాహుల్‌గాంధీ అన్నారు.కొన్ని రోజుల క్రితం ప్రధాని మోదీ పార్లమెంటులో కుంభమేళా గురించి మాట్లాడారని, తాను ఆయనకు ఒక విషయం చెప్పదల్చుకున్నానని రాహల్‌గాంధీ అన్నారు. కుంభమేళా గురించి మాట్లాడటం మంచి విషయమేగానీ, ఆయన దేశ భవిష్యత్తు గురించి మాట్లాడితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. దేశంలోని యువతను మోదీ ప్రభుత్వం నిరుద్యోగులుగా మార్చిందని, కాబట్టి ప్రధాని మోదీ ఆ సమస్యపై కూడా మాట్లాడాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.

## సంపాదకీయం

# ధరలపై నియంత్రణ ఏదీ !

ఓ వైపు రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బియ్యం ధరలను నియంత్రించే వారు లేకుండా పోయారు. చౌకబియ్యం మాత్రం 45 ఏళ్ల తరవాత కూడా రూపాయికే లభిస్తున్నాయి. అందుకే తెల్ల రేషన్ కార్డుల కోసం జనం ఎగబడుతున్నారు. తమకు కార్డు రాలేదంటే తమకు రాలేదని దరఖాస్తులు చేస్తున్నారు. దీనికితోడు సన్నబియ్యం ఉగాది నుంచి సరఫరా చేస్తామని ప్రకటించారు. ఇంకేముందు అమ్ముకునే వారికి మరింత ఆదాయం దక్కగలదు. ఇప్పటికే రేషన్ బియ్యం మాఫియా పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నా ...ఎక్కడా దాడులు జరడం లేదు. ఇకపోతే నిత్యావసర ధరల్లో క్రమంగా మళ్లీ వంటనూనెల ధరలు పెగుతున్నాయి. ఉల్లిపాయల ధరలు రిటైల్‌లో 30 నుంచి 50 వరకు పలుకుతున్నాయి. శక్కర, పప్పుల ధరలు కూడా సామాన్యలకు అందకుండా పోతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల ధరలు అదుపు కావడం లేదు. ధరలను అదుపుచేసే వ్యవస్థ తమ చేతుల్లో లేదన్న రీతిలో ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయి. గృహనిర్మాణ రంగం సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. దీనిని అదుపు చేసేలా స్టీల్, సిమెంట్ ఇతర గృహనిర్మాణ రంగ వస్తువుల ధరలను అదుపు చేయలేకపోతున్నారు. ప్రజలు ఎన్నికల సమయంలో ఈ అంశాలను ఎజెండా చేసుకుని నేతలను నిలదీయాల్సిన అవసరంఉంది. నేతల మాటల ప్రలోభాలకు, డబ్బులకు లొంగితే వారు మనపై స్వారీ చేస్తారని తేలిపోయింది. అందువల్ల ఉచిత పథకాలకు లొంగరాదన్న జ్ఞానాన్ని పొందడం లేదు. వారిచ్చే డబ్బులకు లొంగడంతో పాలన కూడా తమ ఇష్టానుసారంగా చేసుకుంటున్నారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో వాటిపై చర్చించడం లేదు. చట్టసభల్లో అవి చర్చకు రావడం లేదు. అన్ని పార్టీలు వ్యూహాత్మకంగా తమ ఎజెండా అంశాలపైనే చర్చిస్తున్నాయి. పార్లమెంట్ కావచ్చు, రాష్ట్రాల అసెంబ్లీలు కావచ్చు జరుగుతున్న తంతు ఇదే. ధరల నియంత్రణ ఎవరి చేతుల్లో ఉందో ప్రజలు తమ దగ్గరికి వ్చేనేతలను అడగాలి. ఎందుకు ధరలను నియంత్రించలేక పోతున్నారో ప్రశ్నించాలి. అచ్ఛేదిన్ మాటలకే పరిమతం అయ్యింది. ధరలు తరచూ పెరగడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలను ఆందోళన వరున్తున్నాయి. నిజానికి ధరలు తగ్గించడమెలా..ఖర్చులు తగ్గించుకోవడమెలా అన్నది పాలకులు ఆలోచన చేయడం లేదు. తమ ఖర్చులను పైసా కూడా తగ్గించుకోకుండా విలాసాలకు అలవాటు పడ్డ పాలకులు ఉన్నంతకాలం గ్యాస్, పెట్రో ధరలు పెరుగుతూనే ఉంటాయి. ఏ మాత్రం భవిష్యత్ ఆలోచన లేని పాలకలు ప్రజలకు గుదిబండగా మారారు. ప్రజల నుంచి వసూలుల చేసిన పన్నులతో విలాసాలు చేస్తున్నారు. దర్పంగా కాలం వెళ్లదీస్తున్నారు. ముందుగా పాలకులు పెడుతున్న ఖర్చులపై చర్చ చేయాలి. మనం కడుతున్న పన్నులతో వారు విమానాలు, ఎసి కార్లలో తిరుతూ పాలన చేస్తున్నారు. విదేశాలతో పోలిస్తే మన దేశంలో పాలకుల విలాసాలు చాలా ఎక్కువ. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలి. అందుకే వ్యాపారులు ధరలు పెంచడం, పాలకలు చూసీ చూడనట్లుగా ఉండడం ..సామాన్యులపై ఇది మోయ లేని భారంగా మారింది. రోజురోజుకూ నిత్యావసర సరుకులు, వంటనూనెల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా.. మరోవైపు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదల పేదప్రజలను బతకలేని స్థితికి చేర్చింది. సామాన్యుల జీవితాలను గమనంలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కరెంట్ తదితర ఛార్జీలను పెంచి నడ్డి విరుస్తున్నారు. బెంగుళూరు లాంటి నగరాల్లో మంచినీటి కటకటలను ముందే గుర్తించడం లేదు. నీటి సమస్యలు రాకుండా ఓ పదేళ్ల ప్రణాళికలు రచించడం లేదు. పెరుగుతున్న ధరలతో ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. దీనికితోడు జిఎస్టీ పేరుతో చేస్తున్న పన్ను వసూళ్లు కూడా నడ్డి విరుస్తున్నాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, నూనె ధరలు భగ్గుమంటుండగా ప్రభుత్వాలు ప్రజా సంక్షేమంను పట్టించుకోకుండా ధరలు పెంచి పెనుభారం మోపడం తగదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవల్సిందే. ప్రభుత్వాలు తమ ఖర్చులను తగ్గించుకోవాలి. పాలకులు తమ ఖర్చులను తగ్గించుకోవాలి. దుబారాను అదుపు చేయాలి. అప్పుడే దేశంలో ధరలను అదుపు చేయగలం అని గుర్తించాలి. దీనిపై ముందుగా ఎన్నికల్లో చర్చించాలి. పాలకుల జల్సా ఖర్చులపై, వారికి ఇస్తున్న టిఎ,డిఎలపై చర్చించాలి. ఆ దమ్ము పాలకులకు,ప్రతిపక్షాలకు ఉందా లేదా అన్నది చర్చించాలి. దేశంలో గత పదేళ్ల కాలం నాటి ధరలను బేరీజు వేసుకుని చర్చ చేయాలి. స్టీల్, సిమెంట్ ధరలు కూడా అదుపు లేకుండా పోయాయి. సామాన్యులకు గృహం అన్నది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడ్డ విషయంగా మారింది. మధ్య తరగతి ప్రజలు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేకుండా చేశారు. పెరుగుతున్న నిర్మాణ రంగం వ్యవయంతో పాటు రిజిస్ట్రేషన్, జిఎస్టీ ఛార్జీలు మోత మోగిస్తున్నాయి.

# ముగిసిన శ్రీ మన్న్యాయ సుధ మంగళ మహోత్సవం

**–శ్రీమఠం పీఠాధిపతులు విద్యార్థులను అభినందిస్తూ.. న్యాయసుధ ప్రశంసా ధృవ పత్రాలతో పాటు ఒక్కొక్కరికి రూ.1లక్ష బహుమతి**



మంత్రాలయం, మార్చి 24(శ్రీచక్ర) : ధార్మిక క్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో రెండు రోజుల పాటు నిర్వహించిన శ్రీ మన్న్యాయ సుధ మంగళ మహోత్సవం ఘనంగా ముగిసింది. సోమవారం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మన్న్యాయ సుధ గ్రంథాలపై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మహా పండితులు, సంస్కృత విద్యార్థులచే అనువాద ప్రక్రియ పోటాపోటీగా జరిగింది. ఈ పోటీల్లో ఉత్తీర్ణత సాధించిన 8 సంస్కృత విద్యార్థుల కు ప్రశంసా ఉత్తీర్ణత ధృవ పత్రాలను మంత్రాలయం శ్రీ రాఘువేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు, మహోపాధ్యాయ రాజా ఎస్ గిరియాచార్యులు, ఇతర మఠాదీశుల చేతుల మీదుగా అందజేసి ఒక్కొక్కరికి రూ. 1లక్ష లు నగదు తో పాటు ఘనంగా సత్కరించారు. శ్రీ మన్న్యాయ సుధ మంగళ మహోత్సవం కార్యక్రమంలో శ్రీ వ్యాసరాజ మఠం శ్రీ విద్యాశ్రీశ తీర్థ స్వామిజీ, శ్రీ పాదరాజ మఠం శ్రీ సుజయనిధి తీర్థ స్వామిజీ, పెజావర మఠం శ్రీ విశ్వప్రసన్న తీర్థ స్వామిజీ, పలిమారు మఠం శ్రీ విద్యాదీశ తీర్థ స్వామిజీ, సుదేవాదిరాజ మఠం శ్రీ విశ్వవల్లభ తీర్థ స్వామిజీ, భీమనకట్టె మఠం శ్రీ రఘువరేంద్ర తీర్థ స్వామిజీ, తంబిహళ్లి మఠం శ్రీ విద్యాసాగర మాధవ తీర్థ స్వామిజీ, రామోహళ్లి మఠం శ్రీ విశ్వభూషణ తీర్థ స్వామిజీ, సుబ్రమణ్య మఠం శ్రీ విద్యాప్రసన్న తీర్థ స్వామిజీ, కణ్వ మఠం శ్రీ విద్యాకాన్వ విరాజా తీర్థలు, బాలగారు మఠం శ్రీ అక్షోభ్య రామప్రియ తీర్థ స్వామిజీ, ఉడిపి శ్రీ బన్నంజే రాఘవేంద్ర తీర్థ స్వామిజీ, శ్రీ వామన తీర్థ స్వామిజీ లు పాల్గొన్నారు. అనంతరం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు పీఠాధిపతులందరిని మఠం సాంప్రదాయ పద్ధతిలో సన్మానించారు. శ్రీమన్న్యాయసుధ మంగళ అనువాద మహోత్సవం తిలకించేందుకు వివిధరాష్ట్రాలనుంచి పండితులు, భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.









# కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటలు నిలుపుకోవాలి

**–ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ధర్నా**




మంత్రాలయం, మార్చి 24(శ్రీచక్ర) : ఎన్నికల ముందు ఇచ్చిన మాటలు కూటమి ప్రభుత్వం నిలుపుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి.అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ మండల కార్యదర్శి హెచ్ జయరాజు ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ధర్నా నిర్వహించి డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఎస్ రవి కి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని ఇల్లు లేని ప్రతి పేదవాడికి మూడు సెంట్లు స్థలం కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి జయరాజ్ మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను వెంటనే తీర్చాలని, ప్రధానంగా మండలంలో నెలకొన్న తాగునీటి కొరత ను దృష్టిలో ఉంచుకొని అవసరమైన చోట కొత్త పైపులైను ను ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా మంత్రాలయం నుండి కల్లుదేవకుంట చిలకలదోన గ్రామాలకు వేసిన పాత ఎస్‌పి పైపులైను తొలగించి కొత్త పైపులైను వేసి, నీటి సరఫరా చేయాలని, స్థానికంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేయాలన్నారు. మండల పరిధిలోని గ్రామాలలో నీటి ఎద్దడిని నివారించి, గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం లో భాగంగా చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని, నియోజకవర్గ కేంద్రంలో కనీసం వంద పడకల ఆసుపత్రి లేకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. అంతకు ముందు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి రాఘవేంద్ర సర్కిల్ లో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద కడుబూరు మండల కార్యదర్శి తిక్కన్న, కార్యకర్తలు లక్ష్మన్న, అనిల్, ప్రాణేషు, అంజి, మారెప్ప, సురేషు, వీరేష్, దావీదు తదితరులు పాల్గొన్నారు

**ఏప్రిల్ 1, 2న బీసీల చలో ఢిల్లీ.. -ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష ఉపాధ్యక్షులు కేసన శంకరరావు, గుడిసె శివన్న**




మంత్రాలయం,మార్చి 24(శ్రీచక్ర) : జాతీయస్థాయిలో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్నిఏప్రిల్1,2తేదీలలో జరపతలపెట్టినట్లు, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష ఉపాధ్యక్షులు కేసన శంకరరావు, గుడిసె శివన్నప్రకటనలోతెలియజేశారు. ఈసారిజరిపే జనగణనతో పాటే సమగ్ర కుల గణన జరపాలని, చట్టసభలలో బీసీలకు జనాభా దామాషామేరకురిజర్వేషన్‌లుఇవ్వాలని,బీసీమహిళకు సబ్ కోటాని స్తూ మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేయాలని, పలు డిమాండ్లతో ఏప్రిల్ ఒకటో తేదీన కేంద్ర మంత్రులు మరియు పార్లమెంటు సభ్యులందరికీబీసీసంక్షేమసంఘంజాతీయ మరియు రాష్ట్ర నాయకులు విజ్ఞాపన పత్రాలను సమర్పిస్తారన్నారు. ఏప్రిల్ 2వ తేదీన బీసీల ప్రధాన డిమాండ్లపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద "భారీ నిరసన ధర్నా" జరుగుతుందన్నారు. చలో ఢిల్లీ నిరసన కార్యక్రమాలలో రాష్ట్రంలోని బీసీ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా శంకరరావు విజ్ఞప్తి చేశారు

# పోసాని తర్వాత విడదల రజనీ...?



గుంటూరు, మార్చి 24,మాజీ మంత్రి విడదల రజనీపై ఏసీబీ కేసు నమోదయింది. ఆమెను త్వరలోనే అరెస్ట్ చేసే అవకాశాలున్నాయని తెలిసింది. ఏసీబీ కేసులో విడదల రజనీతో పాటు మరికొందరిపై కూడా కేసులు నమోదయ్యాయి. విజిలెన్స్ అధికారులను పంపించి బెదిరించి యడ్లపాడులోని స్టోన్ క్రషర్ నుంచి 2.20 కోట్ల రూపాయలు విడదల రజనీ బ్యాచ్ వసూలు చేసిందని ఏసీబీ ఆరోపిస్తుంది. రజనీతో పాటు ఐపీఎస్ అధికారి పల్లె జాషువాతా? పాటు మరికొందరిపైన కూడా కేసులు నమోదు చేశారు. అనేక సెక్షన్లకింద నమోదయిన ఈకేసుల్లో ఏ2 నిందితురాలిగా విడదల రజనీ ఉన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇచ్చిననివేదిక ను ఆధారంగా చేసుకుని కేసు నమోదయింది. ఎక్కేది ఎప్పుడంటే? 2.20 కోట్లు తీసుకుని... 2020లో ఈ ఘటన జరిగిందని అధికారులు చెబుతున్నారు. స్టోన్ క్రషర్ ను క్లోజ్ చేయకుండా ఉండాలంటే తమకు 2.20 కోట్ల రూపాయలు చెల్లించాలని బెదిరించడంతో దాని యజమానులు చలపతిరావు, నంబూరి శ్రీనివాసరావులు రజనీని కలిసి చర్చించారు. తర్వాత రజనీ అనుచరులకు ఆ డబ్బులు చెల్లించినట్లు ఆధారాలున్నాయని ఏసీబీ అధికారులు తెలిపారు. డబ్బులు ఇవ్వడం ఆలస్యమయిందని భావించి, ఆగ్రహించి రజనీ విజిలెన్స్ అధికారుల చేత స్టోన్ క్రషర్ పై దాడులు కూడా నిర్వహించి దాని యజమానులను భయభ్రాంతులకు గురి చేసినట్లు కూడా ఫిర్యాదు అందింది. ఎవరి అనుమతి లేకుండానే విచారణ చేసిన అప్పటి ఐపీఎస్ అధికారి పల్లె జాషువాను కూడా ఈకేసులో నిందితులుగా చేర్చారు.స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి యాభై కోట్ల రూపాయలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని, నిబంధనలకు విరుద్ధంగా స్టోన్ క్రషర్ ను నిర్వహిస్తున్నారని విజిలెన్స్ అధికారుల బెదిరింపులకు దిగారన్నఆరోపణలున్నాయి. దీంతో భయపడిన స్టోన్ క్రషర్ యజమానులు రజనీని కలసి తమకు జరిమానా పడకుండా సాయంచేయాలని కోరగా, అందుకు ప్రతిగా 2.20 కోట్ల రూపాయలు తీసుకున్నారన్న ఆరోపణలపై ఇప్పుడు ఏసీబీ కేసు నమోదు చేసింది. విడుదల రజినీతో పాటు అప్పటి గుంటూరు ఆర్వీఈవో, ఐపీఎస్ అధికారి పల్లె జాషువాతో పాటు మరికొందరిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆరోపణలు రాగా తొలుత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు అందింది. దీంతో ఆ విభాగానికి చెందిన డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా విచారణకు ఆదేశించారు. విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఆ నివేదిక సిఫార్స్ మేరకు ప్రభుత్వం ఏసీబీ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారులు ఇందుకు సంబంధించి ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేశారు.లంచం తీసుకోవడం, అనుచిత లబ్ధి కలిగించడం, నేరపూరిత కుట్ర, బెదిరింపు తదితర అభియోగాలపై అవినీతి నిరోధక చట్టంలోని 7, 7ఏ, ఐపీసీలోని 384, 120బీ సెక్షన్లు మీద కేసు పెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో ఏ1గా విడదల రజిని, ఏ2గా ఐపీఎస్ అధికారి పల్లె జాషువా, ఏ3గా విడదల రజిని మరిది అయిన విడదల గోపి, ఏ4గా రజిని పీఏ దొడ్డ రామకృష్ణలను నిందితులుగా చేర్చింది. బెదిరింపులు, అక్రమ వసూళ్ల పై తొలుత విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్స్ కు ఫిర్యాదు అందగా.. ఆ విభాగం డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా విచారణ జరిపించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ ప్రాథమిక దర్యాప్తు చేశారు. ఆధారాలు లభించడంతో కేసు నమోదు చేశారు.కేసు విషయానికి వస్తే.. '2020 సెప్టెంబరు 4న పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం విశ్వనాథుని కండ్రిక గ్రామంలోని శ్రీ లక్ష్మి బాలాజీ స్టోన్ క్రషర్ కండ్రికను అప్పటి చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజిని పీఏ దొడ్డ రామకృష్ణ సందర్శించారు. స్టోన్‌క్రషర్‌పై దాడులు చేయకుండా, స్టోన్ క్రషర్ ను మూయించకుండా ఉండాలంటే రజినిని కలవాలని ఆదేశించారు. దీంతో దాని యజమానులు నల్లపనేని చలపతిరావు, నంబూరి శ్రీనివాసరావు రజిని ఆఫీసుకు వెళ్లి కలిశారు. వ్యాపారం సజావుగా జరగాలంటే అడిగినంత డబ్బులివ్వాల్సిందేనని, మిగతా విషయాలన్నీ తన పీఏ రామకృష్ణతో మాట్లాడాలని రజిని వారికి హుకుం జారీ చేశారు. వారిద్దరూ రామకృష్ణను కలవగా ఆయన రూ.5కోట్లు డిమాండ్ చేశారు. ఆ తర్వాత వారం రోజులకే సెప్టెంబర్ 10న అప్పటి గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (ఆర్‌వీఈవో)గా ఉన్న ఐపీఎస్ అధికారి పల్లె జాషువా తన బృందంతో శ్రీ లక్ష్మిబాలాజీ స్టోన్‌క్రషర్‌లో తనిఖీలకు వెళ్లారు. ఆ స్టోన్ క్రషర్‌పై ఎవరూ ఫిర్యాదు చేయకుండానే హడావుడి చేశారు. అప్పటి విజిలెన్స్ డీజీ అనుమతి కూడా తీసుకోలేదు. విజిలెన్స్ మెయిన్ ఆఫీసుకు ఈ తనిఖీల గురించి సమాచారమే ఇవ్వలేదు. విచారణలో వెల్లడైన అంశాలతో నివేదిక రెడీ చేశారు.జాషువా ఆదేశాలతోనే తామంతా తనిఖీల్లో పాల్గొన్నామని మిగతా అధికారులను ఏసీబీకి తెలిపారు. ఎఫ్‌ఐఆర్ లో కూడా విడదల రజనీ ప్రమేయం ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో విడదల రజనీ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లే కనపడుతుంది. పోసాని బెయిల్ పై బయటకు రావడంతో తర్వాత ఇక జైలుకు వెళ్లేది విడదల రజనీ అంటూ సోషల్ మీడియాలో పోస్టింగ్ లు కనపడుతున్నాయి.భయపడను...లొంగనుతనపై నమోదయిన కేసులపై మాజీ మంత్రి విడదల రజనీ స్పందించారు. తనపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. బీసీ మహిళ రాజకీయంగా ఎదిగితే కూటమి ప్రభుత్వం తట్టుకోలేకపోతుందన్నారు. తనపై నమోదయిన కేసులన్నీ అక్రమ కేసులేనని, రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగానే కేసులు నమోదు చేశారని విడదల రజని అన్నారు. అక్రమ కేసులకు తాను భయపడనని, న్యాయపోరాటం చేస్తానని విడదల రజనీ తెలిపారు. ఆధారాలు లేకుండా తనపై కేసులు నమోదు చేశారంటూ విడదల రజనీ ధ్వజమెత్తారు. కేసులకు భయపడి తాను రాజకీయంగా లొంగిపోనని తెలిపారు. తాను వైసీపీలోనే ఉంటూ పోరాటం సాగిస్తానని విడదల రజనీ స్పష్టం చేశారు.

## ప్రొఫెషన్ కోర్సుల్లో నైపుణ్యం సాధించి భవిష్యత్ లో స్థిరపడండి: జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య



కర్నూలు, మార్చి 24 (శ్రీచక్ర ): ప్రొఫెషన్ కోర్సుల్లో నైపుణ్యం సాధించి, భవిష్యత్ లో స్థిరపడాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 13 ల్యాప్ టాప్ లను, 12 సెల్ ఫోన్లను జాయింట్ కలెక్టర్ విభిన్న ప్రతిభావంతులకు అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్, డిగ్రీ తదితర ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న అర్హులైన విభిన్న ప్రతిభావంతుల కొరకు 13 ల్యాప్ టాప్ లను ఇవ్వడం జరిగిందన్నారు.. అదే విధంగా ఇంటర్మీడియట్ కోర్సు పూర్తి చేసిన 12 మంది విభిన్న ప్రతిభావంతులకు సెల్ ఫోన్లను అందజేయడం జరిగిందన్నారు... ఒక్కొక్క ల్యాప్ టాప్ దాదాపుగా 58 వేల రూపాయలు ఉంటుందన్నారు.. విద్యార్థులు ల్యాప్ టాప్ లు, మొబైల్ ఫోన్ లను వినియోగించుకుని వారి ప్రొఫెషనల్ కోర్సుల్లో నైపుణ్యం సాధించాలని, భవిష్యత్ లో ఉన్నత స్థానంలో స్థిరపడాలని జాయింట్ కలెక్టర్ విద్యార్థులకు సూచించారు... జాయింట్ కలెక్టర్ విద్యార్థులకు ల్యాప్ టాప్ లను అందజేస్తూ ఎక్కడ చదువుతున్నారు... ఏమి చదువుతున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.. బాగా చదువుకోవాలని జాయింట్ కలెక్టర్ విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రాయిస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన పరిష్కరించాలి పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**



కర్నూలు, మార్చి 24 (శ్రీచక్ర): కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 94 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని క్రిష్ణ వర్ష పొదుపు సంఘంలో రూ. 8 లక్షలు తీసుకొన్నాము. ప్రతి నెల కంతులు కట్టించుకున్నారు. పొదుపు సంఘంలోని లీడర్లైన సభ్యులు బ్యాంకు కు డబ్బులు కట్టకుండా మోసం చేశారని బ్యాంకు నుండి నోటిసులు వచ్చాయని కర్నూలు, నిర్మల్ నగర్ కు చెందిన పల్లవి, రషీద, విజయలక్ష్మీ మరియు ఇతర సభ్యులు ఫిర్యాదు చేశారు. నా పెద్ద కుమారుడు ఇల్లురాసి ఇవ్వాలని, ఇంటి, కుళాయి పన్నులు కట్టకుండా ఇంటి పట్టాలు తీసుకెళ్ళి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు, కోత్తపేటకు చెందిన సుంకులమ్మ ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలు కు చెందిన సూర్య మాధవరావు రూ. 6 లక్షల 50 వేలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు , వెంకటరమణకాలనీకి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. వాటర్ ప్లాంట్ ఫిట్టింగ్ చేస్తానని చెప్పి ఒక లక్ష రూపాయలు తీసుకొని కర్నూలు కు చెందిన వారిష వాటర్ టెక్స్ మున్నా మోసం చేశాడని కర్నూలు , మద్దూర్ నగర్ కు చెందిన రామ్ మూర్తి ఫిర్యాదు చేశారు. కోడుమూరు వెంకటగిరిలో ఉన్న రెండున్నర ఎకరాల పొలాన్ని రంగమ్మ డబ్బులు తీసుకుని అమ్మినది. మనవడు గిడ్డయ్య అడ్డుపడి ఆమె ను రిజిష్టర్ చేయనియవ్వ కుండా మోసం చేస్తున్నాడని కర్నూలు కు చెందిన అంజనమ్మఫిర్యాదు చేశారు. పట్టాభిరామయ్య కుటుంబఅవసరాల కోసం డబ్బులు తీసుకోని ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు , సంతోషనగర్ కు చెందిన రహీంబీ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు పాల్గొన్నారు.

### కోడుమూరు సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం సంక్షేమ అధికారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు, మార్చి 24 (శ్రీచక్ర): కోడుమూరు సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం సంక్షేమ అధికారి జి.రాముడును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. కోడుమూరు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 11వ తేదీన హాస్టల్ లో ఉంటున్న పదవ తరగతి విద్యార్థి మహేష్ 7వతరగతి విద్యార్థి పి.రాజు,8వ తరగతి విద్యార్థి జె.ఇసాక్ లపై భౌతికంగాదాడికి పాల్పడినట్లు 24వతేదీనవాట్సప్‌లో వీడియో వైరల్ అయింది..ఈ ఘటన11వతేదీ జరిగినప్పటికీపై అధికారుల దృష్టికి తీసుకురాకపోవడంతో పాటు వసతి గృహ నిర్వహణ లో సరైన పర్యవేక్షణ చేయకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన కారణంగా వసతి గృహ సంక్షేమ అధికారి జి.రాముడు ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు..ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజలు సమయం ఇవ్వాలి

**నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు**








కర్నూలు, మార్చి 24 (శ్రీచక్ర): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రజలు అధికారులకు నిర్దిష్ట సమయం ఇవ్వాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు సూచించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు రాగ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ యన్.చిన్నరాముడు, ఎస్ఈ రాజశేఖర్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వర్ రెడ్డి, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి , ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, సూపరింటెండెంట్ వాజిద్, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు. 1. చంద్రమౌళి నగర్ నందు తాగునీటి, రహదారులు, మురుగు కాలువల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు బాలశౌరి, రఘురామయ్య, వంశీ తదితరులు కోరారు. ఇలాంటి సమస్యను శ్రీనివాస్ నగర్‌కి చెందిన స్థానికుడు నరసింహ బాబు, మెట్రో నగర్‌కి చెందిన హనీఫ్, రఘు విన్నవించారు. 2. పందిపాడు ఇందిరమ్మ గృహాల్లో మోటార్లు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు పి.రాజు, ధర్మ, అన్వర్ విన్నవించారు. 3. 20వ వార్డు కరీంనగర్, సనత్ నగర్ నందు మురుగు కాలువ నిర్మించాలని సి.యస్.రాజు, ఆర్.ప్రభావతి తదితరులు కోరారు. 4. మారుతి మెగాసిటీ నందు కొంతకాలం క్రితం వేసిన బీటీ రహదారి అధ్వానంగా తయారైందని, మరమ్మతులు చేపట్టాలని స్థానికులు జైపాల్ రెడ్డి, దామోదర్ రెడ్డి, రామక్రిష్ణ రెడ్డి కోరారు. 5. రిచ్‌మండ్ అవెన్యూ నందు పారిశుద్ధ్య పనులను చేపట్టాలని స్థానిక కాలనీవాసుల అసోసియేషన్ ప్రతినిధులు వెంకటనాయుడు, పవన్ కుమార్, రఘునాథ్, కోటేశ్వరరావు కోరారు. 6. బాలాజీ నగర్ నందు వాటర్ ట్యాంక్‌ను నింపాలని బాలాజీ నగర్ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధులు ప్రతాప్ రెడ్డి, వెంకట సుబ్బయ్య, తదితరులు విన్నవించారు. 7. డెక్కన్ బిర్యానీ వద్ద రహదారి కన్నా కల్వర్ట్ ఎత్తు తక్కువ ఉండటం కారణంగా, మురుగు నీరు తమ ఇళ్ళ వద్దకు వస్తున్నాయని ఆదిత్య నగర్ వాసులు షఫి, రాఘవరెడ్డి, భాగ్యలక్ష్మి తదితరులు కోరారు.

# పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కారం చేయాలి

**రీ సర్వే కి సంబంధించి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో పెండింగ్ లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయండి :జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య**





కర్నూలు, మార్చి 24 (శ్రీచక్ర): పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జాయింట్ కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.. పిజిఆర్ఎస్ కు సంబంధించి రీఓపెన్ కేసుల మీద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, కర్నూలు వద్ద 55, కర్నూలు ఆర్డీఓ వద్ద 20, పత్తికొండ ఆర్డీఓ వద్ద 9, ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 4 రీ ఓపెన్ కేసులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ లాగిన్ లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయడంలో పురోగతి తీసుకొని రావాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు... అదే విధంగా రెవెన్యూ గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులలో పెండింగ్ లో ఉన్న వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి కర్నూలు ఆర్డీఓ వద్ద 18, ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 16, పత్తికొండ ఆర్డీఓ వద్ద 12, డిపిఓ వద్ద 3, డిఎస్ఓ వద్ద 2, ట్రైబల్ వెల్ఫేర్, డిఎంహెచ్ఓ, డిఈఓ, హౌసింగ్ పిడి ల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్ లో ఉన్న వాటిని బియాండ్ ఎస్ఎల్ఎ వెళ్లకుండా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.రీ సర్వే కి సంబంధించి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో పెండింగ్ లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 25 నుండి27 వ తేదీ వరకు ఎపిపిఎస్సీ పరీక్షలు

**పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబడవు**
**ఎపిపిఎస్సీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి**
**జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య**





కర్నూలు మార్చి 24 (శ్రీచక్ర): ఎపిపిఎస్సీ పరీక్షలు నిర్వహణకు పగడ్బందిగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈనెల 25 నుండి 27 తేదీ వరకు ఏపీపీఎస్ సి వారు ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ లోని అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్, మరియు అనలిస్ట్ గ్రేడ్-2, మరియు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాల నియామకానికి నిర్వహించే పరీక్షల నిర్వహణపై జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుండి 27 వ తేది వరకు నిర్వహించే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 25వ తేదీన కర్నూలులోని నంద్యాల చెక్పోస్ట్ దగ్గర గల అయాన్ డిజిటల్ ఇనిస్ట్యూట్ లో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ లోని అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ నియామకం కొరకు పరీక్షలు, 25 వ తేదిన ఎమ్మిగనూరు లోని సెయింట్ జోసెఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో అనలిస్ట్ గ్రేడ్-2 నియామకం కోసం పరీక్షలు, 26 వ తేదిన ఈఔ నంద్యాల చెక్పోస్ట్ దగ్గర గల అయాన్ డిజిటల్ ఇనిస్ట్యూట్ లో అనలిస్ట్ గ్రేడ్-2 నియామకం కోసం పరీక్షలు, ంఔ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నియామకం కోసం పరీక్షలు, 27 వ తేది ,ఈఔ అయాన్ డిజిటల్ ఇనిస్ట్యూట్ లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నియామకం కోసం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలు కంప్యూటర్ ద్వారా నిర్వహించడం చేత విద్యుత్ అంతరాయం కలగకుండ చూడాలని విద్యుత్ శాఖ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని, ఇన్విజిలేటర్లు వద్ద కూడా మొబైల్ వుండరాదన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. సమావేశంలో కలెక్టర్ కార్యాలయం ఏవో విజయశ్రీ,,జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, ఏపీ ఎస్పీడీసీఎల్ సిబ్బంది, పోలీస్ శాఖ వారు,ఎపిపిఎస్సీ సెక్షన్ ఆఫీసర్ డిలేశ్వరరావు, లైజనింగ్ ఆఫీసర్స్,ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, సెక్షన్ ఇన్చార్జ్ లు, తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ పెట్టుబడి తో ఎక్కువ లాభం అనే మాయలో పడకండి

**క్రికెట్ బెట్టింగ్ కు దూరంగా ఉండండి**
**యువత ఈ మాయలో పడకుండా, తల్లిదండ్రుల ఆశలను నాశనం చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలి:జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**



కర్నూలు, మార్చి 24 (శ్రీచక్ర): ఐపీఎల్, టి 20 క్రికెట్ మ్యాచ్ లను ఆసరాగా తీసుకొని, అమాయక ప్రజల ను మోసగించేందుకు క్రికెట్ బెట్టింగ్ ముఠాలు యాక్టివ్‌గా పనిచేస్తున్నాయని "తక్కువ పెట్టుబడి పెట్టి, ఎక్కువ లాభాలు సాధించ చ్చు" అనే ఆశ చూపిస్తూ ఈ ముఠాలు ఎందరో యువతను, సామాన్యులను ఆర్థికంగా దెబ్బ తీస్తున్నాయి . ఇటీవల క్రికెట్ బెట్టింగ్ యాప్స్ వల్ల, త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో అనేకమంది అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చట్టవిరుద్ధమైన ఈ బెట్టింగ్ యాప్స్ ప్రభావంతో కొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కర్నూల్ జిల్లా పోలీసులు ఇటువంటి క్రికెట్ బెట్టింగ్ ముఠాలను అణచివేసేందుకు ప్రజలు సహకరించాలని, సమాచారం స్థానిక పోలీసులకు గాని లేదా డయల్ 100/ 112 అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు.ముందుగా చిన్న మొత్తంలో గెలిచేలా చేసి నమ్మకాన్ని పెంచుతారు. తర్వాత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహిస్తారు. ఓడిపోయాక డబ్బు తిరిగి పొందేందుకు మరింత పెట్టుబడి పెట్టాలని మభ్యపెడతారు. అప్పులు తీసుకునే స్థితికి వచ్చి, తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూసేవరకు వదలరు. పరిమితి దాటి అప్పులు పెరిగితే బెట్టింగ్ ముఠాలు, లోన్ యాప్ ప్రతినిధులు కుటుంబసభ్యులను వేధిస్తారు. తీవ్ర ఒత్తిడితో కొందరు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితికి చేరుకుంటున్నారు. నకిలీ అకౌంట్లు, నకిలీ యూపీఐ లావాదేవీలు అసలు నిర్వాహకులు కనిపించరు. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లను ఉపయోగించి ఆకర్షణీయమైన ప్రకటనలు చేస్తారు.బెట్టింగ్‌లో పెట్టిన డబ్బు తిరిగి వచ్చే అవకాశం తక్కువన్నారు. ఓడిపోయినవారు మళ్లీ అదే తప్పు చేయకుండా ఉండలేరు, ఇది వ్యసనంగా మారుతుంది. "ఈజీ మనీ" మాయలో పడకండి శ్రమించిందే శాశ్వత సంపాదనన్నారు. అప్పుల కోసం అనాగరిక మార్గాలను ఆశ్రయించకండి చట్టబద్ధమైన మార్గాలను వినియోగించుకోండి.సోషల్ మీడియా ప్రకటనలు నమ్మొద్దు అవి చాలా వరకు మోసపూరితమైన లింకులే, ప్రభుత్వ అనుమతి లేని బెట్టింగ్ యాప్స్ వాడడం నేరం, చట్ట ప్రకారం శిక్షార్హం. మీ పిల్లలు, స్నేహితులు బెట్టింగ్ వైపు మొగ్గు చూపితే వారికి అవగాహన కల్పించండి. నిజమైన సంపాదన మీ శ్రమ, నైపుణ్యం, తెలివితేటలపై ఆధారపడి ఉంటుందన్నారు. బెట్టింగ్ మాయలో పడకుండా, చట్టబద్ధమైన మార్గాల్లో జీవనం సాగించండి.మీ కుటుంబాన్ని, భవిష్యత్తును కాపాడుకోవడానికి బెట్టింగ్ యాప్స్‌కు వీలైనంత దూరంగా ఉండి, మీ భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు.

# పోక్సో యాక్ట్ -2012" పై న్యాయ విజ్ఞాన సదస్సు





కర్నూలు లీగల్, మార్చి 21 (శ్రీ చక్ర): న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కోడుమూరు ఎంపీడీఓ ఆఫీస్ లో పోక్సో యాక్ట్ పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అధితిగా కర్నూలు జిల్లా మొదటి అదనపు జడ్జి జి. భూపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు, పొదుపు మహిళలకు, విలేజ్ సెక్రటరీ లకు, మహిళా పోలీస్ లకు పోక్సో యాక్ట్ పై అవగాహన కల్పించారు. చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు కలవని తెలిపారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడకుండా ఈ పోక్సో యాక్ట్ ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ పోక్సో కేసులను పరిష్కరించేనీదుకు ప్రత్యేక కోర్ట్ ఉందని అన్నారు. ఈ సదస్సులో ట్రైనీ జ్యూడిషియల్ ఆఫీసర్స్ ఈశ్వర వెంకట ప్రసాద్, లీలా సాయి సుభాష్, హేమ, అర్చన, శ్రీవల్లి, కోడుమూరు డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీఓ రాముడు, ఐసీడీస్ సీడీపీఓ శారద, కోడుమూరు ఎస్. ఐ. శ్రీనివాసులు, కర్నూలు వెలుగు ఏపీఎం వెంకస్వామి, కోడుమూరు వెలుగు ఏపీఎం సుబ్బయ్య, కోడుమూరు సర్పంచ్ భాగ్య రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అలయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ అవార్డు అందుకున్న డాక్టర్ చప్పిడి



రామచంద్రపురం, మార్చి 24(శ్రీచక్ర) డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అలయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ అవార్డుని అందుకున్నారు.ఈమేరకుఅలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ దక్షిణ భారత కౌన్సిల్ సమావేశం మరియు అవార్డ్స్ ఫంక్షన్ చెన్నై సవేరా హోటల్ లో జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ చప్పిడి చేసిన సేవలకు గుర్తింపుగా దక్షిణ భారత కౌన్సిల్ చైర్మన్ రాజేంద్రన్ చేతుల మీదుగ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావుకు ప్రశంసా పత్రం తోపాటు అవార్డును తీసుకున్నారు .ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ చెప్పిడి వెంకటేశ్వరరావును పూర్వ అంతర్జాతీయ అధ్యక్షులు తిరుపతి రాజు కోడూరు రంగారావు, మాటూరు శిరీష ,అలయన్స్ డైరెక్టర్స్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన అదనపు జిల్లా జడ్జి.




రామచంద్రపురం, మార్చి 24(శ్రీచక్ర)స్థానిక కోర్టుల ప్రాంగణంలో ఆవరణలో సోమవారం 13వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి ఎం శంకర్రావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిఎండలు తీవ్రమవుతున్న తరుణంలో ఈ చలివేంద్రం ప్రజలందరికీ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. జిల్లా కోర్టు తో పాటు సీనియర్,జూనియర్, మేజిస్ట్రేట్ కోర్టులు, తహశీల్దార్ కార్యాలయం, ఎస్.టి.ఒ. ఆఫీసు, పోలీసు స్టేషన్ వంటి కార్యాలయాలకు వచ్చే వారందరి దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం స్థానిక బార్ అసోసియేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసామన్నారు. తొలిరోజు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు, సుమారు 500 ల మందికి న్యాయమూర్తులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె. వెంకటేశ్వరరావు జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి. నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ సాయిప్రసాద్ వాడ్రేవు, సంయుక్త కార్యదర్శి చిన్నం వీరెడ్డి, జూనియర్ల ప్రతినిధి పిల్లా ప్రుధ్వీ, సీనియర్ జూనియర్ మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు..

## క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి






రామచంద్రపురం, మార్చి 24( శ్రీచక్ర) క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ లక్ష్మీ ప్రసన్న పేర్కొన్నారు. సోమవారం వెల్ల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీని నిర్వహించినారు. డాక్టర్ వి వి లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ప్రజలందరూ క్షయ వ్యాధి పట్ల శ్రద్ధ వహించాలని భారతదేశంను క్షయ వ్యాధి రహితముగా ఉంచాలని తెలిపారు. తెమడ తో కూడిన దగ్గు, అలసట, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గటం,చాతిలో నొప్పి, జ్వరము వంటి లక్షణాలు ఉంటే తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ అలేఖ్య గ మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దనే ఆశాల ద్వారా మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ధూమపానం, మద్యం సేవించడం ఆపుకోవటం వలన సురక్షితంగా ఉంటారని తెలిపారు. డివిజనల్ సూపర్వైజర్ జి కమల్ శేషు మాట్లాడుతూ ప్రస్తుతం, వెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 11 మందికి, ద్రాక్షారామ ఆరోగ్యం కేంద్రం పరిధిలో 13 మందికి, రామచంద్రపురం పట్టణ పరిధిలో 28 మందికి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు కే శ్రీనివాస్, డి రాజేశ్వరి, సి హెచ్ ఓ లు, ఏఎన్ఎంలు, మగ ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

# సమన్వయంతో సాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**





రామచంద్రపురం, మార్చి 24(శ్రీచక్ర)నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ పిలుపు నిచ్చారు. ఈమేరకు సోమవారం రామచంద్రపురం పట్టణంలో లయన్స్ క్లబ్ కళ్యాణ మండపం నందు ఇరిగేషన్, డ్రైన్స్ అధికారులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, రైతులతో మంత్రి సమావేశమై రామచంద్రపురం నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం పంట పొలాలు ఈనిక దశలో ఉన్నాయని సాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఏ ఒక్క ఎకరం కూడా ఎండడానికి వీలు లేదన్నారు. గతంలో డ్రైనేజీలు, కాలువలను పట్టించుకోకపోవడంతో గుర్రపు డెక్కపూడికతో నిండి అధ్వానంగా తయారయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్రైనేజీలు కాలువలను బాగు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అధికారులు కూడా గతంతో పోలిస్తే ఇప్పుడు మెరుగ్గా పనిచేస్తున్నారని ఈసంధర్భంగా మంత్రి కితాబు ఇచ్చారు. రైతు 10 వేళ్ళు మట్టిలో పెడితేనే మన 5 వేళ్ళు నోట్లోకి వెళ్తాయని గుర్తు చేశారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు అధికారులకి రైతులకి మధ్య వారధిలా పని చేయాలన్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు క్షేత్రస్థాయిలో ఎక్కడ నీరందడం లేదో గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాగునీటి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల నుంచి గతంలో ఉన్న సమస్యలను అధిగమించి అందరూ కష్టపడి పని చేస్తున్నారన్నారు. ఎక్కడో కొన్నిచోట్ల శివారు భూములకు నీరందకపోతే మండలమంతా సాగు నీరందడం లేదని కొంతమంది ప్రచారం చేస్తున్నారని అది తగదని హితవు పలికారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు మెరుగ్గా పనిచేస్తున్నాయని.. ఇంకా మెరుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సూపర్ సిక్స్ లో భాగంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. త్వరలోనే రైతులకు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం అందించే విధంగా నిధులు విడుదల చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ ఈ రామకృష్ణ, డ్రైన్స్ డీ ఈ పోచరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ కాజులూరు, రామచంద్రపురం, ఎర్ర పోతవరం, కోటిపల్లి అధ్యక్షులు ఎల్ కృష్ణ చైతన్య, ఎం సత్యనారాయణ రెడ్డి, ఎన్ సుబ్రహ్మణ్యేశ్వర రావు , విజయరామరాజు అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గంధం బోస్ హత్య కేసును చేదించిన పోలీసులు

జీలుగుమిల్లి మార్చి 24 ( శ్రీ చక్ర) ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలలోగల తాటియాకులగూడెం గ్రామంలో 17- 3 - 2025 సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో వైఎస్ఆర్సిపి కార్యకర్త గంధం బోసు ను ( 35 సంవత్సరాలు) అను వ్యక్తిని ఇనుపరాడుతో దారుణంగా కొట్టి చంపిన సంఘటన పై జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ నందు 18 --3- 2025 తేదీన మర్డర్ కేసుగా నమోదు చేయడం జరిగింది. ఈ కేసును ఏలూరు జిల్లా ఎస్పీ కిషోర్ వారి పర్యవేక్షణలో పోలవరం డిఎస్పి ఎం. వెంకటేశ్వరరావు. జీలుగుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. వెంకటేశ్వరరావు. ఎస్సై పి. నవీన్ కుమార్. మరియు బుట్టాయిగూడెం ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు. టీ నర్సాపురం ఎస్సై ఎం జై బాబు. సర్కిల్ సిబ్బందితో పై నేరాలకు పాల్పడిన అనుమానిత ముద్దాయిలను వెతుకుతుండగా 24. 3. 2025. తేదీన సదరు ముద్దాయిలు గంధం శాంతి కుమారి. సొంగ గోపాలరావులను అశ్వరావుపేట ఏజీ కాలేజీ వద్ద అదుపులో తీసుకొని విచారించగా గంధం శాంతి కుమారి తో గత కొంతకాలంగా సొంగ గోపాలరావు కు అక్రమ సంబంధం కలిగి ఉందని అది కొనసాగించడానికి తన భర్తను అడ్డు తొలగించేందుకు ఈ హత్యకు పాల్పడినట్టు ఇరువురు విచారణలో అంగీకరించారు. ఈ కేసు విచారణలో ఈరోజు24-3-2025. సోమవారం ముద్దాయిలపై cr .no.33/2025.U/S 109 (1)BNS all treated into 103 (1)BNS గా కేసును నమోదు చేసి రిమాండ్ కు పంపించడం జరుగు తుందని జీలుగుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. వెంకటేశ్వరరావు తెలిపారు.



# మహిళాభివృద్ధితోనే సమాజ పురోభివృద్ధి...!

**మహిళల భద్రత, గౌరవం, సాధికారత లక్ష్యం.**
**మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం కృషిమహిళల రక్షణ కోసం శక్తి యాప్**
**అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి సుభాష్**







రామచంద్రపురం, మార్చి 24(శ్రీచక్ర) సృష్టికి మూలం, అన్నిటిలో సగభాగం ఐన మహిళలు నింగి నుంచి నేలదాకా అన్ని రంగాల్లో పోటీ పడుతూ ముందుకు దూసుకుపోతున్నారని, మహిళల భద్రత, గౌరవం, సాధికారత లక్ష్యంగా, మహిళా అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ రామచంద్రపురం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనంలో ఐసిడిఎస్ సిడిపిఓ వరహాలక్ష్మి అధ్యక్షతన వైభవంగా, కన్నుల పండుగగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ నారీ లోకానికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మహిళా సాధికారత కోసమే పని చేస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బడ్జెట్లో మహిళా శిశు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం రూ. 4,332 కోట్లు హెచ్చించిందన్నారు. మహిళలు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయాల్లో రక్షణ పొందాలని సూచించారు. మహిళలు ఉన్నతంగా చదువుకోవాలని, ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. భారత సంతతికి చెందిన హ్యోమగామి సునీతా విలియమ్స్, మదర్ థెరిసా,ఝాన్సీ లక్ష్మీబాయి, సావిత్రిబాయి పూలే, సరోజినీ నాయుడులను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. స్త్రీ లేకుండా సృష్టి లేదని, మహిళలు విద్యతోనే మనుగడ సాధించగలరన్నారు. కుటుంబ వ్యవస్థను సక్రమంగా నడపగలిగిన సత్తా, ఘనత మహిళకే సాధ్యమన్నారు. మహిళకు ఆస్తి హక్కు కల్పించడం ద్వారా పురుషులతో సమాన హోదా కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు ప్రదర్శించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి సుభాష్ ను, మరో అతిధి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీనాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్, ఎంఈఓ నాగేశ్వరి, డాక్టర్ కవిత, అంగన్వాడి అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గ, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వీరలక్ష్మి, సూపర్వైజర్లు, టీచర్లు ఆయాలు పాల్గొన్నారు. అనంతరం కేకు కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలకు పుష్కలంగా ఉపాధి అవకాశాలు. రామచంద్రపురం నియోజవర్గంలోని మహిళలకు ఆర్థిక పరిపుష్టి కలిగేలా త్వరలో 30 చిన్న,మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు రానున్నాయని మంత్రి సుభాష్ వెల్లడించారు. వీటి ఏర్పాటుతో మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఇప్పటికే కుట్టు మిషన్ శిక్షణ, ఎంబ్రాయిడరీ, బ్యూటీ పార్లర్, ఆర్గానిక్ ఫార్మింగ్, పచ్చళ్ళు తయారీ వంటి శిక్షణ ఇచ్చేందుకు కృషి జరుగుతుందన్నారు. శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుపేదలు లేని, నిరుద్యోగం లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని తన ఆశయమని మంత్రి సుభాష్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ రోడ్ల పనులు 100 శాతం పూర్తి..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా..




నంద్యాల, మార్చి 24 (శ్రీచక్ర) :.: ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా ప్రారంభించిన రోడ్ల నిర్మాణ పనులు వంద శాతం పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్ అండ్ బీ రోడ్లకు ఉన్న పాట్ హోల్స్ ను జిల్లాలో వంద శాతం పూర్తి చేయడం, అదే విధంగా పంచాయతీ రోడ్లకు సంబంధించి స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో సిసి రోడ్లను 96 శాతం పూర్తి చేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపారని ఇందుకు సంబంధించిన అధికారులను కలెక్టర్ అభినందించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి నిర్దేశించిన 75 లక్షల పని దినాల లక్ష్యంలో ఇప్పటి వరకు 73 లక్షల పని దినాలు కల్పించామని... పెండింగ్లో ఉన్న లక్ష్యాన్ని అధిగమించి ఉపాధి వేతన దారులకు పనులు కల్పించడంలో ఎంపీడీవోలు, క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పంట నీటి కుంటలు, పర్కులేషన్ ట్యాంక్స్, ఫిష్ ట్యాంక్స్ తదితర వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రంలోగా మస్టర్ మొత్తాన్ని వంద శాతం పూర్తి అప్డేట్ చేసి సంబంధిత బిల్లులు అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.పి4 సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్న నేపథ్యంలో ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ అధికారులను, ఎంపీడీవోలను ఆదేశించారు. అదే విధంగా జిఓఎంఎస్.37 ప్రకారం నియోజకవర్గ ప్లాన్ ఏర్పాటు ఏర్పాటు చేసేందుకు నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా గ్రీవెన్స్ కు వచ్చే వారి దరఖాస్తులను మండల స్థాయిలోనే పరిష్కరించేలా చూడాలన్నారు. జిల్లాలోని పట్టణాలలో ఉన్న ప్రధాన కూడళ్ల వద్ద చలువ పందిళ్ళు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వేసవి కాలంలో త్రాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పి4 సర్వేకు సంబంధించిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.శ్రీశైలంలో జరగు ఉగాది ఉత్సవాలకు సంబంధించి పెద్ద ఎత్తున కర్ణాటక నుండి ప్రజలు వస్తున్న సందర్భంగా మెడికల్ క్యాంపులు, అంబులెన్సులు ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓ, ఆత్మకూరు ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. అకాల వర్షాల వల్ల కోవెలకుంట్ల, దొర్నిపాడు, గోస్పాడు మండలాల్లో పంట నష్టం అంచనాలను గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలని సంబంధిత తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

## శ్రీశైలానికి కాలినడకన వెళ్లే కన్నడ భక్తులకు గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం,ఉచిత వైద్య శిబిరం..



నందికొట్కూరు: 24, (శ్రీచక్ర) : కర్ణాటక నుండి శ్రీశైలానికి కాలినడకన వెళుతున్న కన్నడ భక్తుల కొరకు నందికొట్కూరు తాలూకా గ్రామీణ వైద్యులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అన్న దాన కార్యక్రమంతో పాటు భక్తులకు జ్వరము నొప్పులు వంటి జబ్బులకు గ్రామ వైద్యులు వైద్యసాహాయము అందించారు. ఈ అన్నదాన కార్యక్రమం గ్రామీణ వైద్యులే వంటలు చేసి వండి వడ్డించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఇంత విజయవంతంగా సహకరించిన నందికొట్కూరు తాలూకా గ్రామీణ వైద్యులు డాక్టర్ నాగరాజు డాక్టర్ వనజ, డాక్టర్ ఎం ఎం భాష,డాక్టర వెంకటరమణ,డాక్టర్ మల్లయ్య,డాక్టర్ కుమార్, డాక్టర్ అనురాధ, డాక్టర్ ఉమర్ భాష, డాక్టర్ మౌలాలి, డాక్టర్ అబ్దుల్లా, డాక్టర్ అబ్దుల్ రహమాన్,డాక్టర్ గిడ్డయ్య, డాక్టర్ రహమత్ భాష,డాక్టర్ లతీఫ్,భాష డాక్టర్,గోపాల్ డాక్టర్,కాయుమ్ బాషా డాక్టర్, ఆలీ,తదితరులు పాల్గొన్నారు.

## వేసవి నేపథ్యంలో కార్మికులు అప్రమత్తం

నంద్యాల మార్చి 24-వేసవి ఉష్ణోగ్రతలో దృష్టిలో పెట్టుకొని కార్మికులు అప్రమత్తంగా జాగ్రత్తగా ఉండాలని కర్నూలు జోన్ కార్మిక శాఖ సంయుక్త కార్మిక కమిషనర్, యం.బాలు నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు కార్మికుల రక్షణకు యాజమాన్యంలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలో విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలను అనుగుణంగా రాష్ట్ర కార్మిక కమిషనర్ శేషగిరి బాబు ఆదేశాలు జారీ చేశారన్నారు, కర్మాగారాలు, దుకాణాలు, సంస్థలో పనిచేసేవారు భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులు, వలస కూలీలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఇదివరకే పలు సూచనలు చేసినట్లు వివరించారు. కార్మికుల పని గంటల్లో మార్పు చేయాలన్నారు. పని ప్రాంతంలో చల్లని నీరు, నీడ వసతి కల్పించాలని కోరారు , వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకొని ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్స్, ఐ.వి ఫ్లూయిడ్స్, అత్యవసర మందులను సమకూర్చుకోవాలని చెప్పారు, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ కార్మికుల పని వేళలు మార్పు చేయాలని యాజమాన్యం వారిని కోరారు. డీహైడ్రేషన్ నివారణ మార్గాలను అవగాహన కల్పించాలని కోరారు.

# దేశ జీడీపీకి, డీలిమిటేషన్ కు ఏం సంబంధం?

తెలంగాణ జీడీపీలో ఆదిలాబాద్, ములుగు, ఆసిఫాబాద్ వెనకబడి ఉంటే... వాటా అక్కర్లేదా?
లిక్కర్ దొంగలంతా ఒకే చోట జమై మోదీపై దక్షిణాది పేరుతో డ్రామాలాడుతున్నరు
6 గ్యారంటీలపై ప్రజలను మోసం చేశారు
ఇంకా 16 లక్షల మంది రైతులకు రుణమాఫీ కానేలేదు
రుణమాఫీ పూర్తయ్యిందని ప్రకటించం సిగ్గు చేటు
బీఆర్ఎస్ దొంగ నోట్లను ముద్రించింది
బీదర్ లో దొంగ నోట్ల ప్రింటింగ్ ప్రెస్ ను నడిపింది బీఆర్ఎస్ నాయకుడే
టీచర్లరా....మీ భవిష్యత్ కోసం తపస్ లో చేరండి
తపస్ పక్షాన ఉద్యమాలను ఉధృతం చేయండి
మీ ఉద్యోగాలు పోతే... బీజేపీ టిక్కెట్లిచ్చి గెలిపించుకుంటాం
కరీంనగర్ లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్...
సంజయ్ ఆధ్వర్యంలో బీజేపీ ఎమ్మెల్సీలను ఘనంగా సన్మానించిన తపస్

న్యూఢిల్లీ: మార్చి 24,(శ్రీచక్ర) కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే, ఆప్, సీపీఎం పార్టీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లిక్కర్ దొంగలంతా ఒకే చోట సమావేశమై డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. "స్టాలిన్ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల లిక్కర్ స్కాం చేసింది. కేరళలోనూ లిక్కర్ స్కాం బయటపడింది. ఆప్, బీఆర్ఎస్ నేతలు ఆల్రెడీ లిక్కర్ స్కాం చేసి జైలుకు పోయింది. వీళ్లంతా కలిసి డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతూ మోదీ ప్రభుత్వంపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్నారు"అని దుయ్యబట్టారు. వాళ్లంతా దేశ జీడీపీకి, పార్లమెంట్ లో ప్రాతినిధ్యానికి లింకు పెట్టడంపై మండిపడ్డారు. "నిన్న చెన్నైయ్ లో స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లిక్కర్ దొంగల ముఠా ఒకే చోట సమావేశమై విచిత్రమైన తీర్మానం చేశారు. దేశ జీడీపీలో దక్షిణాది వాటా 36 శాతం ఉన్నందున పార్లమెంట్ లో కూడా దక్షిణాదికి 36 శాతందాకా వాటా ఇవ్వాలని అడుగుతున్నరు. ఇదేం విచిత్రం? దేశ జీడీపీకి పార్లమెంట్ లో ప్రాతినిధ్యానికి సంబంధమేంది? అట్లనుకుంటే తెలంగాణ జీడీపీలో వెనుకబడ్డ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ములుగు వంటి జిల్లాల ప్రాతినిధ్యం చాలా తక్కువ. అంత మాత్రాన అసెంబ్లీలో వాటికి ప్రాతినిధ్యం ఉండకూడదా? ఇదెక్కడికి దిక్కుమాలిన ప్రతిపాదన? దక్షిణాది పేరుతో రాజకీయాలు చేస్తూ డీలిమిటేషన్ ను అడ్డుకునే కుట్రలు చేయడమేంది?" అని ఫైర్ అయ్యారు.ఈరోజు మధ్యాహ్నం కరీంనగర్ లోని శుభం గార్డెన్ లో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి సంజయ్ హాజరై ప్రసంగించారు. ఏమన్నారంటే...టీచర్ల దమ్మేందో, తపస్ అనే ఉపాధ్యాయ సంఘం తలుచుకుంటే ఏమైతదో మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో చూపించారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులారా.... మీరంతా ఏ సంఘంవైపు చూడకండి. జాతీయవాద భావజాలం, టీచర్ల కోసం కొట్లాడే ఏకైక సంఘం తపస్. ఆ సంఘంలోనే చేరాలని కోరుతున్నా. మీకోసం కొట్లాడేది, దెబ్బలు తినేది, జైలుకు కూడా పోయేందుకు వెనుకాడని నాయకులు తపస్ మాత్రమే. అందుకే తపస్ బలపర్చిన అభ్యర్థి మల్క కొమరయ్యకు టిక్కెట్ ఇప్పించి సునాయాసంగా గెలిపించింది. తపస్ ను రాష్ట్రంలో నెంబర్ వన్ సంఘంగా మార్చి తీరుతాం.తెలంగాణ సాధనలో టీచర్ల, ఉద్యోగుల పాత్ర మరువలేం. 42 రోజుల సకల జనుల సమ్మె చేసి తెగించి కొట్లాడి రాష్ట్రం సాధించుకున్నరు. కానీ 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనతో తెలంగాణ అప్పుల పాలైంది. కేసీఆర్ కుటుంబ పాలనతో సర్వ నాశనమైంది. గతంలో కేసీఆర్ మనుషులు బీదర్ లో ఒక ప్రింటింగ్ ప్రెస్ లో దొంగ నోట్లు ముద్రించారు. ఆ ప్రింటింగ్ ప్రెస్ ను మూసివేసేందుకు మన రాష్ట్ర పోలీసులు వెళితే... ఒత్తిడి తెచ్చి అక్కడికి వెళ్లకుండా చేశారు.ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో పంచిన నోట్లన్నీ దొంగ నోట్లే.బీఆర్ఎస్ పాలన పీడ విరగడ కావాలని ఆ పార్టీని ఓడించి కాంగ్రెస్ కు అధికారం అప్పగిస్తే ఏం ఒరిగింది? కేసీఆర్ పాలనలో తెలంగాణ అప్పుల్లో మునిగిపోయిందని చెప్పిన రేవంత్ రెడ్డి అయినప్పటికీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను తీర్చడంతోపాటు 6 గ్యారంటీలను కూడా అమలు చేసి తీరుతామని ప్రకటించారు. కానీ ఏమైంది? 15 నెలలుగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను కాంగ్రెస్ పార్టీ దారుణంగా వంచిస్తూనే ఉన్నదు.విద్యాశాఖకు అసలు మంత్రి కూడా లేదు. ఆయనే ఆ శాఖ మంత్రిగా ఉన్నా టీచర్లకు ఒరిగిందేమీ లేదు. కేంద్రం ప్రతి 6 నెలలకు ఒకసారి డీఏ ఇస్తోంది... నిత్యం మోదీపై విషం కక్కే కాంగ్రెస్ ప్రభుత్వం 5 డీఏలు ఎందుకు పెండింగ్ లో పెట్టారు? మరో 3 నెలలైతే జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. టీచర్ల, ఉద్యోగుల పెండింగ్ బిల్స్ మొత్తం రూ.8వేల కోట్లు. అట్లాగే రిటైర్డ్ మెంట్ బెన్ పిట్స్ బకాయిలు రూ.11 వేల కోట్లు. వీళ్లకు పైసలు ఇవ్వమంటే డబ్బుల్లేవని చెబుతున్న ప్రభుత్వం 18 శాతం కమీషన్ ఇస్తే మాత్రం కాంట్రాక్టర్లకు బిల్స్ క్లియర్ చేస్తోంది. ఆరోగ్య శ్రీ బకాయిలు ఇవ్వడం లేదు. ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలివ్వడం లేదు. కేజీబీవీ టీచర్ల బాధలు వర్ణణాతీం. ఈ సమస్యను పరిష్కరించాలని విద్యాశాఖ అధికారి యోగితారాణాకు నేనే ఫోన్ చేసిన. ఆ సమస్య పరిష్కారం కోసం క్రుషి చేస్తా.టీచర్లను, తపస్ నాయకులను నేను కోరేదొక్కటే... సమస్యలపై పోరాడండి. తపస్ తల్చుకుంటే విద్యాశాఖను సమూలంగా ప్రక్షాళన కావాలి. టీచర్ల సమస్యలు పరిష్కారం కావాలే. ప్రభుత్వం ఉద్యోగం నుండి తీసేస్తదనే భయం మీకు వద్దు. మిమ్ముల్ని కాపాడుకునే బాధ్యత మాది. ఎందుకంటే విద్యా శాఖను అర్బన్ నక్సల్స్ చేతిలో పెట్టి తుపాకీ రాజ్యం తేవాలని కాంగ్రెస్ భావిస్తోంది. మోదీ ప్రభుత్వం విద్యార్థులకు కలం అందించి మహానుభావులుగా తీర్చిదిద్దాలని చూస్తుంటే... కాంగ్రెస్ అందుకు భిన్నంగా పాఠ్యపుస్తకాల్లో అర్బన్ నక్సల్స్ భావజాలాన్ని జొప్పించి తుపాకీ రాజ్యం కోసం కుట్రలు చేస్తుంటే సమాజానికి ఏ సందేశం పంపినట్లు? అసలు ఏ ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి అర్బన్ నక్సల్స్ ను విద్యా కమిషన్ లో నియిమించారో సమాధానం చెప్పాలి.

## బడ్జెట్‌లో హైదరాబాద్‌కు కేటాయింపులు ఘనం.. నిధుల విడుదల మాత్రం శూన్యం : ఎమ్మెల్యే కేపీ వివేకానంద



కుత్బుల్లాపూర్, మార్చి 24(శ్రీచక్ర) : హైదరాబాద్ మహానగర అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా జరిగినప్పటికీ.. నిధులు విడుదల చేయడంలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇతర పద్దులపై జరిగిన చర్చల సమయంలో హైదరాబాద్ నగరాభివృద్ధిపై బడ్జెట్ కేటాయింపులు, నిధుల విడుదలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ సందర్భంగా కేపీ వివేకానంద మాట్లాడుతూ.. గతంలో హైదరాబాద్ నగరానికి ప్రతి సంవత్సరం రూ.10 వేల కోట్లు కేటాయిస్తామని గతంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. జీహెచ్‌ఎంసీకి రూ.2654 కోట్లు కేటాయించి రూ.1200 కోట్లను మాత్రమే విడుదల చేశారని తెలిపారు. హెచ్‌ఎండీఏకు రూ.2,500 కోట్లు కేటాయించి పైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. జలమండలికి రూ.3385 కోట్లు కేటాయిస్తే.. రుణాలకే రూ.800 కోట్లు ఇచ్చారని, ఇప్పటికే ప్రతిపాదించిన మెట్రో రూట్లను రద్దు చేశారని అన్నారు. మెట్రోకు రూ.1100 కోట్లు కేటాయిస్తే.. రూ.300 కోట్లు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. మూసీ ప్రాజెక్టుకు రూ.1500 కోట్లు కేటాయిస్తే .. కేవలం రూ.80 కోట్లు మాత్రమే ఇచ్చారని చెప్పారు. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ పేరుతో హంగామా చేస్తున్నారని మండిపడ్డారు. జీహెచ్‌ఎంసీకి రూ.7582 కోట్లు అడిగితే..రూ.3100 కోట్లే కేటాయించారని సభలో లేవనెత్తారు. ఈ విధంగా గతేడాది కేటాయించిన నిధుల్లో కేవలం 25 శాతమే విడుదల చేయడంపై నగరాభివృద్ధిపై ప్రభుత్వ చిత్తశుద్ధి కనిపిస్తుందని విమర్శించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం వెంటనే పారిశుద్ధ కార్మికుల వేతనాలు 18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మిక పక్షపాతిగా కేసీఆర్ ఎంతో దాతృత్వంతో నాడు పారిశుద్ధ కార్మికుల జీతాలను 7 వేల నుంచి 12 వేలకు పెంచారని కేపీ వివేకానంద తెలిపారు. 2023 ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 18 వేల రూపాయలు ఇస్తామని కార్మికులకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం వెంటనే పారిశుద్ధ కార్మికుల యంత్రాల ద్వారా ఊడ్చేందుకు రాంకీ సంస్థకు పనులను అప్పజెప్పినా, అది ఆచరణలో సాధ్యం కాలేదని అన్నారు. ప్రస్తుతం రోడ్లను కార్మికులే ఊడుస్తున్నా బిల్లులు మాత్రం రాంకీకి చెల్లిస్తున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు.

## అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడగింపు..

హైదరాబాద్ : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో మూడు నెలల పాటు పొడిగించారు. ఈ మేరకు ఐ అండ్ పీఆర్ కమిషనర్ హరీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 30వ తేదీతో ముగియనున్న అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని జూన్ 30వ తేదీ వరకు పొడిగించారు. అక్రిడేషన్ కార్డుల గడువును పొడిగించడం ఇది నాలుగోసారి.

## రైతు ఆర్థిక పరిపుష్టి సాధించాలనే నాడు ఎఫ్ పి ఓ లను ఏర్పాటు చేశాం

నర్సంపేట మార్చి 24, ((శ్రీచక్ర) నర్సంపేట నియోజకవర్గంలో అత్యదిక ఎఫ్ పి ఓ లు ఏర్పాటు చేసి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన రైతులకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపాడు.మా పాలనలో ఎఫ్ పి ఓ లను ఏర్పాటు చేస్తున్నప్పుడు చాలా మంది వ్యంగంగా మాట్లాడారని, రైతులు ఐక్యత చాటి సంఘాలను నిలబెట్టి,రాష్ట్రంలోనే అత్యదికంగా ఎఫ్ పి ఓ లను సాధించుకున్న ఘనత నర్సంపేట నియోజకవర్గానికి దక్కిందని పెద్ది ఆనందం వ్యక్తం చేశాడు.కేంద్రం ప్రత్యేక ఎఫ్ పి ఓ మేళ నిర్వహించాలనే అవకాశం ఇచ్చినప్పుడు 30 శాతం ఎఫ్ పి ఓ ప్రస్థుత వరంగల్ జిల్లాలోనే ఉండటం విశేషమన్నాడు. నర్సంపేట నియోజకవర్గంలో 90 ఎఫ్ పి ఓ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నాడు.ఈ మద్య ప్రభుత్వం వాటిని నిర్వీర్య పరచడం వల్ల ,ప్రభుత్వం సహకారం లేకపోవటంతో కొన్ని సంఘాలు స్థిరత్వం పొందలేకపోయాయని,ఐనప్పటికి వరంగల్ జిల్లాలో 57 ఎఫ్ పి ఓ లలో 18500 మంది రైతులు ఐక్యత కలిగి క్రియాశిలకంగా పనిచేస్తున్నారన్నాడు. రైతులు ఆర్థిక పరిపుష్టి కలగాలంటే తక్కువ పెట్టుబడి ఎక్కువ దిగుబడి వ్యవసాయ యంత్రికరణ వల్ల వచ్చిందన్నాడు.సన్న ,చిన్నకారు రైతులే తెలంగాణ ప్రాంతంలో ఎక్కువ ఉన్నారని,దానివల్ల 20 గుంటల నుండి 2 ఎకరాల లోపు రైతులే ఎక్కువ,వీటి కోసం యంత్రాలు తీసుకురావటానికి ఖర్చు పెరుగుతుందన్నాడు.ఇందుకు సంబందించి ఖర్చును తగ్గించటం కోసమే ఎఫ్ పి ఓ లను ఏర్పాటు చేయడం,సకాలంలో దిగుబడిని సాదించడం ప్రదాన ఉద్దేశ్యమని,అంతే కాకుండా శిక్షణ,శాస్త్రవెత్తల ద్వారా సూచనలు తీసుకోవటం,మెలకువలు నేర్చుకోవడం,పంటలకు వచ్చే తెగుల్లపై శాస్త్ర వెత్తల సహకారం తీసుకోవడానికి వెసలుబాటు ఉంటుందన్నాడు.ఎలాంటి గ్యారెంటీ లేకుండా నా బార్డ్ లాంటి బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోవటానికి అవకాశం ఉంటుందని తెలిపాడు.పండించిన పంటను మార్కెటింగ్ చేసుకోవటం కోసం కూడా ఎఫ్ పి ఓ లు తోడ్పాటునందిస్తాయని,తక్కువ దరకు పంటను అమ్ముకోకుండా,పంట ఉత్పత్తిని రెండు రెట్ల ఆదాయం పొందేందుకు నిల్వ సామర్థ్యాన్ని ఎఫ్ పి ఓ ల ద్వారా ఏర్పాటు చేసుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుందని వివరించాడు.రైతులు మరింత సంఘటితమై ఎఫ్ పి ఓ లు వాల్యూ ఆడెడ్ సర్వీసుల కోసం రుణాలు పొంది,రైతులే వ్యవసాయ అవసరాకు సంబందించిన వాటిచి ఉత్పత్తి చేసే అగ్రి ఇండస్ట్రీలు నెలకొల్పుకోవటం ద్వారా ఉత్పత్తి చేసిన వాటిని ఎగుమతులు చేసుకుని ఆర్థికంగా పరిపుష్టి సాదించేశ్రీఅవకాశం ఉంటుందన్నాడు.ఈ దేశంలో ఎఫ్ పి ఓ లు ఎలాంటి షరతులు లేకుండా తమ ఉత్పత్తులను అమ్ముకునేలా,ట్రాన్స్ ఫోర్ట్ చేసుకునే చట్టాలు ఉన్నాయని,ఎలాంటి టాక్స్ కట్టాల్సిన అవసరం లేకుండా దేశంలో ఎక్కడైనా అమ్ముకునే వెసలుబాటు కలుగుతుందన్నాడు.విత్తనాల తయారి,సేంద్రీయ ఎరువుల తయారితో పాటు ఇతర ఉత్పత్తులు చేసే విదంగా నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అవకాశం కల్పించామన్నాడు.పర్టిలైజర్స్,ఫెస్టిసైడ్,విత్తనాల తయారి,దాన్యం కొనుగోలు కేంద్రాలు సైతం ఎఫ్ పి ఓ లకు ఇవ్వటం జరిగిందని,వాళ్ళ పండించిన పంటను వాళ్ళె కొనుగోలు చేసే అంశం కీలకమైనదని, రైతు బలంగా ఉంటేనే ఈ దేశం,రాష్ట్రం బలంగా ఉంటుందని.ఎఫ్ పి ఓ లు ఏర్పాటు చేసినపుడు రాబోయే తరాలకు ఉపయోగపడాలనే ముందుచూపుతో మిర్చి ఎక్కవ పండించే రైతులవి ఎక్కువ ఎఫ్ పి ఓ లను ఏర్పాటు చేయటం జరిగిందన్నాడు.మొక్కజొన్న,దాన్యం,కూరగాయలు,పండ్లు పండించే రైతులకు టజూనీ లను ఏర్పాటు చేయటం జరిగిందని,కేసీఆర్ హయాంలో నర్సంపేటలో ఏర్పాటు చేసిన ఎఫ్ పి ఓ లో దేశానికే ఆదర్శంగా నిలిచాయని,మహరాష్ట్ర,కర్నాటక,చత్తిస్ ఘడ్ లాంటి రాష్ట్రాల రైతు సంఘాల నాయకులు,వ్యవసాయ శాస్త్రవెత్తలు ఎఫ్ పి ఓ ల విషయంలో నర్సంపేటను సందర్శించాలని అనుకుంటున్నారని, ఎన్నికల నేపద్యంలో సాద్యపడలేదని.దేశ దృష్టిని ఆకర్శించే విదంగా నర్సంపేట ఎఫ్ పి ఓ లు నిలిచాయని,అందరూ ఈ ఎఫ్ పి ఓ లను అద్యయనం చేయాలని సూచించాడు.

## దమ్మాయిగూడ మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం.. రోడ్డు మీదకు డ్రైనేజీ నీళ్లు, చెత్త

మేడ్చల్ కలెక్టరట్, మార్చి 24: కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా ఉంది దమ్మాయిగూడ మున్సిపాలిటీ అధికారుల తీరు! నాలాలో చెత్త చేరడంతో డ్రైనేజీ నీళ్లు నిలిచిపోయి వాసన వస్తుండటంతో.. ఆ చెత్తను తీసిన అధికారులు రోడ్డుపైనే అడ్డంగా పారబోసి వెళ్లిపోయారు. దీంతో ఇప్పటివరకు వాసనతోనే ఇబ్బంది పడ్డ స్థానికులు.. ఇప్పుడు ఆ మురుగులో నుంచి వెళ్లాల్సి వస్తుంది.దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని భవానీనగర్ మీదుగా మురుగు నీళ్లు పారే నాలాలో కొంతకాలంగా చెత్త చేరడంతో, డ్రైనేజీ నీళ్లు పారడడం లేదు. దీంతో మురుగు నీరు నిలిచిపోయి వాసన రావడంతో ఆ కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన మున్సిపల్ సిబ్బంది వెంటనే నాలాలో నుంచి చెత్తను తొలగించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. తీసిన చెత్తను మాత్రం అక్కడే రోడ్డుపై అడ్డంగా పారబోసి వెళ్లిపోయారు. దీంతో కాలనీవాసులతో పాటు ఆ రోడ్డు గుండా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు వాసనతో పాటు, బురదలో నుంచి వెళ్లాల్సి రావడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చెత్త నాలా లో ఉన్నప్పుడే బాగుండేది అని స్థానికులు అంటున్నారు. అధికారం నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇదే పరిస్థితుల్లో మీరు ఇంట్లో నివసిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. వెంటనే మురుగు నీటి చెత్తను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.




## ఎంఎంటీఎస్‌లో యువతిపై అత్యాచారం.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రశ్నార్థకంగా మహిళల భద్రత : హరీశ్‌రావు



హైదరాబాద్ :(శ్రీచక్ర) నిన్న సాయంత్రం ఎంఎంటీఎస్ రైలులో ఉద్యోగినిపై జరిగిన అత్యాచారయత్నం ఘటన యావత్ తెలంగాణ సమాజాన్ని కలిచివేసింది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్ర రాజధానిలో ఇలాంటి దారుణాలు జరుగుతుంటే, ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం, రైల్వే సిబ్బంది ఏం చేస్తున్నట్లు? అని ప్రశ్నించారు.ఆ కీచకుడి నుండి తనను తాను కాపాడుకోవడం కోసం రైలు నుంచి దూకి తీవ్రంగా గాయపడి, గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ ఆడబిడ్డ దీన స్థితికి ఎవరు బాధ్యులు? ఇందిరమ్మ రాజ్యంలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారడం సిగ్గుచేటు. గతేడాదితో పోలిస్తే, ఈ ఏడాదిలో అత్యాచారం కేసులు 29 శాతం పెరుగుదలతో 2945 కేసులు నమోదైనట్లు సాక్షాత్తు డీజీపీ ప్రకటించారు. అంటే సగటున ప్రతి నెలా 250 అత్యాచార కేసులు నమోదవుతున్న దారుణమైన పరిస్థితి అని హరీశ్‌రావు పేర్కొన్నారు.ప్రతీ రోజూ రాష్ట్రంలో మహిళలలు అత్యాచారాలు, హత్య, వేధింపులకు గురవుతుంటే ప్రభుత్వం చేతులు ముడుచుకు చూస్తున్నది. మహిళలకు భద్రత కల్పించడంలో దారుణంగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి. హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో శాంతి భద్రతలు పడిపోవడానికి మీ చేతగాని పాలనే కారణం. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని ప్రగల్బాలు పలకడం కాదు, ముందు మహిళల ప్రాణాలకు భద్రత కల్పించండి అని హరీశ్‌రావు సూచించారు.

## గ్రూప్-1 పేపర్ల రీవాల్యుయేషన్ జరిపించాలంటూ హైకోర్టులో పిటిషన్




హైదరాబాద్ (శ్రీచక్ర) : తెలంగాణ గ్రూప్-1 ఫలితాలపై అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. పారదర్శకంగా పేపర్లను దిద్దించలేదని.. తెలుగు మీడియం అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని బాధిత అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. అనుభవం లేని అధ్యాపకులచే పేపర్లను దిద్దించి.. అన్యాయం చేశారని టీజీపీఎస్సీపై మండిపడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో గ్రూప్-1 పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాలని గ్రూప్-1 అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గ్రూప్-1 మూల్యాంకనం లోపభూయిష్టంగా జరిగిందని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.గ్రూప్-1 పరీక్షలకు సంబంధించి 18 రకాల సబ్జెక్టులుంటే.. 12 రకాల సబ్జెక్ట్ నిపుణులతోనే పేపర్లను దిద్దించారని పేర్కొన్నారు. మూడు భాషల్లో పరీక్షలు జరిగినా తగిన నిపుణులతో పేపర్లను దిద్దించలేదన్నారు. ఒకే మీడియంలో నిపుణులైన వారితో తెలుగు, ఇంగ్లీష్ మీడియం పేపర్లను మూల్యాంకనం చేయించారు. దీంతో తెలుగు మీడియం అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని పిటిషనర్లు పేర్కొన్నారు.పిటిషనర్ల వాదనలు విన్న ధర్మాసనం.. టీజీపీఎస్సీకి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని టీజీపీఎస్సీని ఆదేశించింది కోర్టు. పిటిషన్‌పై తదుపరి విచారణను కోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది. గ్రూప్-1 జీఆర్ఎల్‌ను టీజీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే.

## దేవుడు చూపిన దారిలో నడుస్తున్నా : సినీ నటుడు సుమన్

అమరావతి : సినిమా బ్యాక్ గ్రౌండ్ లేని తనకు తల్లిదండ్రుల పుణ్యం, వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు, ఆయన చూపిన దారిలో విజయవంతంగా నడుస్తున్నానని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. సోమవారం తిరుమల శ్రీవారిని వీఐపీ ప్రారంభ విరామ గర్భాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. గతంలో ఏం జరిగిందన్నది మరిచిపోయి అందరూ ఆరోగ్యంగా ఉండాలని , అందరికీ మేలు జరిగే కార్యక్రమాలు జరుగాలని దేవుణ్ణి ప్రార్థించినట్లు తెలిపారు. ప్రస్తుతం తాను ఇతర భాషల్లో నటిస్తూ బిజీగా ఉన్నానని పేర్కొన్నారు.తెలుగు, కన్నడ, మలయాళం, ఒరియా సినిమాల్లో నటిస్తునట్లు వెల్లడించారు. అన్నమయ్యలో వేంకటేశ్వరస్వామి, శ్రీ రామదాసులో రాముడిగా, సత్యనారాయణస్వామి సినిమాలో దేవుడి పాత్ర చేశానని వివరించారు. తాను కోరుకున్న దాని కంటే ఎక్కువగా దేవుడు తనకు ఇచ్చాడని స్పష్టం చేశారు.





# స్పోర్ట్స్ న్యూస్


## చిక్కుల్లో మాజీ ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్.. జాత్యహంకార వ్యాఖ్యలు చేశాడంటూ సోషల్ మీడియాలో దుమారం..!





ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025 అట్టహాసంగా మొదలైంది. టీ20 క్రికెట్ సమరం మొదలైన కొద్దిగంటల్లోనే వివాదంలో చిక్కుకున్నది. ఐపీఎల్ కామెంటరీ ప్యానెల్‌లో సభ్యుడిగా భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ చుట్టూ వివాదాలు అలుముకున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్ సందర్భంగా భజ్జీ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. జోఫ్రా ఆర్చర్‌పై హర్భజన్ సింగ్ జాత్యహంకార వ్యాఖ్యలు చేసినట్లుగా పలువురు ఆరోపించారు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ? రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌లో కామెంటరీ చెబుతూ.. ఇంగ్లాండ్, రాజస్థాన్ రాయల్స్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ వివరిస్తూ.. 'బ్లాక్ టాక్సీ' అనే పదాన్ని ఉపయోగించాడు. ఈ కామెంట్స్‌పై అభిమానులు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుర్పించారు. హర్భజన్ క్రికెట్ ఆడుతున్న సమయంలోనూ జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొన్నాడు. తాజాగా మరోసారి హర్భజన్ వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. మ్యాచ్ సమయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసిన ఆర్చర్ 76 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్‌ను తీయలేకపోయాడు. ఐపీఎల్ హిస్టరీలో అత్యధిక పరుగులు సమర్పించిన బౌలర్‌గా చెత్త రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్ సమయంలో కామెంటేటర్‌గా ఉన్న హర్భజన్ సింగ్ .. 'లండన్‌లో నల్ల ట్యాక్సీల మీటర్ చాలా వేగంగా తిరుగుతుంది. ఇక్కడ ఆర్చర్ మీటర్ కూడా అలాగే ఉంది' అంటూ వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా పలువురు నెటిజన్స్ మండిపడుతున్నారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని పలువురు డిమాండ్ చేశారు. అతన్ని ఐపీఎల్ నుంచి బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే, ఆరోపణలపై టర్బోనేటర్ ఇంకా స్పందించలేదు. అయితే, హర్భజన్‌కు పలువురు మద్దతు ప్రకటించారు. జాత్యహంకార వ్యాఖ్యలు చేయలేదని.. ఐపీఎల్‌లో ఆర్చర్ సైతం ఖరీదైన ఆటగాడని.. నాలుగు ఓవర్లలో 76 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీయలేదని.. మాజీ ఆఫ్‌స్పిన్నర్ వ్యాఖ్యల్లో ఉద్దేశం ఇదేనని పలువురు పేర్కొన్నారు. హైదరాబాద్-రాజస్థాన్ మధ్య జరిగిన ఉప్పల్‌లో జరిగిన మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 20 ఓవర్లలో 286 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్ రాణించడంతో ఐపీఎల్ హిస్టరీలో ఇది రెండో అత్యధిక స్కోరు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ ఆరు వికెట్ల నష్టానికి 242 పరుగులు మాత్రమే చేయగలిగింది.

## పెళ్లిపై క్లారిటీ ఇచ్చిన నితీశ్ కుమార్ రెడ్డి!.. బాలీవుడ్ హీరోయిన్‌తో డేటింగ్!!






ఐపీఎల్ 2025 సీజన్‌లో భారీ విజయంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ శుభారంభం చేసింది. రాజస్థాన్ రాయల్స్ జట్టుపై 44 పరుగుల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. అయితే ఈ మ్యాచులో ఓ ఆసక్తకర విషయం చోటు చేసుకుంది. మ్యాచ్ మధ్యలో తెలుగు ప్లేయర్ నితీశ్ కుమార్ రెడ్డి తన పెళ్లిపై స్పందించాడు. మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బౌండరీ లైన్ దగ్గర ఫీల్డింగ్ చేశాడు సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయర్ నితీశ్ కుమార్ రెడ్డి. అప్పుడు స్టాండ్స్ లో కూర్చొన్న కొంతమంది అభిమానులు.. సన్‌రైజర్స్ కు మద్దతుగా అరుస్తూ కనిపించారు. అదే సమయంలో పలువురు నితీశ్ రెడ్డిని 'మ్యారేజ్ ఎప్పుడు బ్రో' అంటూ గట్టిగా అరిచారు. అమ్మాయిలు సచ్చిపోతున్నారురా అయ్యా, బ్రో లవ్ మ్యారేజా అంటూ తెగ కామెంట్లు చేశారు. దానికి నితీశ్ రెడ్డి లోలోపల సిగ్గుపడుతూ నవ్వుతూ కనిపించాడు. అలాగే కాదు అన్నట్టుగా తల ఊపి సైగ చేశాడు. అలా తన పెళ్లి గురించి మ్యాచ్ మధ్యలోనే క్లారిటీ ఇచ్చాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ వీడియో చూసిన ఇంకొంతమంది తెలుగు క్రికెట్ అభిమానులు.. నితీశ్ కు అప్పుడే పెళ్లెందుకు, బాలీవుడ్ హీరోయిన్ తో డేటింగ్ చేశాక చేసుకుంటాడు, కొద్ది రోజులు బ్రతకనివ్వండి బ్రో, కెరీర్ ఈ మధ్యే కదరా వాడు స్టార్ట్ చేసింది అప్పుడే పెళ్లి అని అడుగుతారేంట్రా అంటూ పలు రకాల కామెంట్లు చేస్తున్నారు.

## డేవిడ్ వార్నర్‌ను బూతులు తిట్టిన టాలీవుడ్ స్టార్!!

స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్.. త్వరలోనే టాలీవుడ్ సినిమాతో వెండితెర అరంగేట్రం చేయనున్న సంగతి తెలిసిందే. హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల కలిసి నటించిన రాబిన్ హుడ్ చిత్రంలో అతడు కీలక పాత్ర పోషించాడు. అయితే తాజాగా వార్నర్‌ను ఓ టాలీవుడ్ స్టార్.. స్టేజ్ పైనే దొంగముండా కొడకు అంటూ బూతులు తిట్టారు. దీంతో క్రికెట్ అభిమానులు ఆ నటుడిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టాలీవుడ్ దర్శకుడు వెంకీ కుడుముల.. హీరో నితిన్‌తో కలిసి రాబిన్‌హుడ్ సినిమా చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 28న మూవీ రిలీజ్ కానుంది. విడుదల తేదీ దగ్గర పడడంతో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను మూవీటీమ్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తన దేశం నుంచి వార్నర్ ముఖ్య అతిథిగా విచ్చేసి సందడి చేశాడు. అయితే ఈ ఈవెంట్ కు సినిమాలో నటించిన సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ కూడా హాజరయ్యాడు. ఈ క్రమంలోనే స్టేజ్ పై ఎక్కి మాట్లాడిన రాజేంద్ర ప్రసాద్.. వార్నర్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. "వార్నర్ ను పట్టుకొచ్చారు. అతడిని క్రికెట్ ఆడమంటే.. పుష్ప స్టెప్పులు వేస్తున్నాడు. ఈ దొంగ ముండా కొడుకు.. రేయ్ వార్నర్. ఇదే నా వార్నింగ్." అంటూ వివాదస్పద వ్యాఖ్యలు చేశాడు. అయితే రాజేంద్ర ప్రసాద్ చేసిన ఈ వ్యాఖ్యలు అర్థం కాక, వార్నర్ నవ్వుతూ కనిపించాడు. ప్రస్తుతం రాజేంద్ర ప్రసాద్ చేసిన ఈ కామెంట్స్ తీవ్ర చర్చనయాంశంగా మారాయి. క్రికెట్ అభిమానులు.. రాజేంద్రప్రసాద్ పై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వార్నర్ కు తెలుగు రాదు కాబట్టి, ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు, అలా అనడం కరెక్ట్ కాదని ఫ్యాన్స్ అంటున్నారు.





## మాజీ కెప్టెన్‌కు తీవ్ర గుండెపోటు.. లైఫ్ సపోర్టింగ్ అందిస్తున్న వైద్యులు..!




ప్రపంచ క్రికెట్లో సంచలన ఇన్నింగ్స్‌లు ఆడిన బంగ్లాదేశ్ మాజీ సారథి తమీమ్ ఇక్బాల్ అనూహ్యంగా ఆస్పత్రి పాలయ్యాడు. సోమవారం అతడికి తీవ్రమైన గుండెపోటు రావడంతో అతడిని హుటాహుటిన దవాఖానకు తరలించారు. ప్రస్తుతం తమీమ్ పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెబుతున్నారు. దాంతో, అతడి ఆరోగ్య పరిస్థితిపై కుటుంబసభ్యులు, బంగ్లా అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం తమీమ్ లైఫ్ సపోర్టింగ్ మీద ఉన్నాడని.. అతడిని మళ్లీ మామూలు మనిషిని చేసేందుకు డాక్టర్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని బీసీబీ తెలిపింది. అసలేం జరిగిందంటే.. ఢాకా ప్రీమియర్ డివిజన్ క్రికెట్ లీగ్ మ్యాచ్ సమయంలో తమీమ్ ఛాతిలో నొప్పితో బాధ పడ్డాడు. ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. అతడిని గమనించిన సహచరులు వెంటనే బీసీబీని అప్రమత్తం చేశారు. మొదట హెలిక్యాప్టర్ ద్వారా అతడిని ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. కానీ, సాధ్యం కాకపోవడంతో సిబ్బంది తమీమ్‌ను సమీపంలోని హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఈ మాజీ సారథి ఆరోగ్యాన్ని పరీక్షించిన వైద్యులు లైఫ్ సపోర్టింగ్ ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. అయితే.. మెరుగైన వైద్యం కోసం తమీమ్‌ను ఢాకాకు తీసుకెళ్లాలని బీసీబీ భావిస్తోంది. కానీ.. అతడి ఆరోగ్యం దృష్ట్యా అది సాధ్యం కాదని.. కాస్త కోలుకున్నాక ఢాకాకు తరలించడం మంచిదని డాక్టర్లు సూచించారు. దాంతో, తమ అభిమాన ఆటగాడు త్వరగా కోలుకోవాలని బంగ్లాదేశ్ వ్యాప్తంగా ఫ్యాన్స్ ప్రార్ధనలు చేస్తున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో బంగ్లాదేశ్‌కు గుర్తింపు తీసుకొచ్చిన ఆటగాళ్లలో తమీమ్ ముందువరుసలో ఉంటాడు. విధ్వంసక ఇన్నింగ్స్‌లతో జట్టుకు శుభారంభాలు ఇస్తూ.. బంగ్లా చిరస్మరణీయ విజయాల్లో భాగమయ్యాడీ మాజీ ఓపెనర్. గతేడాది జూలైలో ఇంటర్నేషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తమీమ్.. అప్పటి ప్రధాని షేక్ హసీనా చొరవతో యూటర్న్ తీసుకున్నాడు. స్టార్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్‌తో వివాదం కారణంగా అతడు తిరిగి జట్టుతో కలిసేందుకు విముఖత చూపించాడు. ఈ క్రమంలోనే చాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడేందుకు నిరాకరించిన తమీమ్.. టీ20 లీగ్స్‌పై దృష్టి సారించాడు.

## వావ్ ధోని? 43 ఏళ్లలో కూడా ఏం స్టంపింగ్ చేశాడు.. సూపర్



చెన్నై: చిదంబర్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో చెన్నై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మహేంద్ర సింగ్ ధోనీ చేసిన స్టంపింగ్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. 43 ఏళ్ల వయసులో 0.12 సెకన్లలో స్టంపింగ్ చేయడంతో క్రికెట్ అభిమానులు ఆశ్చర్యపోయారు. 11 ఓవర్‌లో సిఎస్‌కె బౌలర్ నూర్ అహ్మద్ వేసిన బంతిని ఎంఐ బ్యాట్స్‌మెన్ సూర్యకుమార్ యాదవ్ ఆడటానికి ప్రయత్నించాడు. క్రీజులో నుంచి ముందుకు వెళి బంతిని కొట్టడానికి ప్రయత్నించాడు. బంతి వెళ్లి కీపర్ ధోని చేతిలో పడడంతో 0.12 సెకన్లలో వికెట్లను గిరాటేశాడు. దీంతో సూర్య కుమార్ షాక్‌కు గురయ్యాడు. ధోనీకి వయసు పెరుగుతున్న కొలదీ యవ్వనం వస్తుందని క్రికెట్ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ధోనికి 50 ఏళ్లు వచ్చేవరకు సిఎస్‌కె యజమాన్యం అతడితో ఆటను కొనసాగించే అవకాశాలు ఉన్నాయని ధోని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ధోని చివరలో బ్యాటింగ్ వచ్చినప్పుడు ధోని నామంతో చిదంబరం స్టేడియం మార్మోగిపోయింది.

## అంబటి రాయుడు యూ టర్న్..!

టీమిండియా మాజీ క్రికెటర్, తెలుగు తేజం అంబటి రాయుడు మళ్లీ మాట మార్చేసాడు. నిలకడలేని నిర్ణయాలతో కెరీర్‌లో.. రాజకీయ జీవితంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న రాయుడు.. క్రికెట్ కామెంటేటర్, విశ్లేషకుడిగా కూడా




మాట మార్చేసాడు. ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించాడు. ఓ తెలుగు పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఈ ఏడాది ఆర్‌సీబీ టైటిల్ గెలవద్దని కోరుకుంటున్నానని జోకులు పేల్చాడు. ఈ వ్యాఖ్యలపై ఆర్‌సీబీ అభిమానులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీ శుభారంభం చేయగానే.. రాయుడిపై విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదికగా జుగుప్సాకరమైన రీతిలో ట్రోల్ చేశారు. ఆర్‌సీబీ విజయం రాయుడికి చెంపదెబ్బ అనే కామెంట్స్ చేశారు. కానీ రాయుడు మాత్రం ఏకంగా మాటనే మార్చేశాడు. ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో షోలో ఆర్‌సీబీ మాజీ ప్లేయర్ వరుణ్ ఆరోన్‌తో కలిసి మాట్లాడిన రాయుడు.. బెంగళూరు జట్టుపై ప్రశంసల జల్లు కురిపించాడు. ఈ సారి ఆర్‌సీబీ జట్టు బలంగా ఉందని అభిప్రాయపడ్డాడు. ఈ సారి ఐపీఎల్ టైటిల్ గెలిచేలా కనిపిస్తుందని చెప్పాడు. 'ఈ సారి ఆర్‌సీబీ చాలా పటిష్టంగా ఉంది. టైటిల్ గెలిచే టీమ్‌లా కనిపిస్తోంది వరుణ్.. ఇలా ఎందుకు చెబుతున్నానంటే.. అతను ఆర్‌సీబీ డైహార్డ్ ఫ్యాన్.'అని రాయుడు అనగానే.. వరుణ్ ఆరోన్ నవ్వు ఆపుకోలేకపోయాడు. ఈ వ్యాఖ్యలు తనను షాక్‌కు గురి చేశాయని చెప్పాడు. 'ధన్యవాదాలు.. రాయుడు చెప్పిన మాటలు ఆశ్చర్యానికి గురి చేశాయి. ఈ రోజు అతను పూర్తిగా ఆర్‌సీబీ మనిషిలా మారిపోయాడు.'అని వరుణ్ బదులిచ్చాడు. ఆ వెంటనే రాయుడు.. తాను ఎప్పుడూ ఆర్‌సీబీ సామర్థ్యాలను గుర్తిస్తానని, కానీ కొంతమంది నిజాన్ని జీర్ణించుకోలేరని నవ్వుతూ చెప్పాడు.'నేను ప్రతీసారి ఆర్‌సీబీ సామర్థ్యం గురించి మాట్లాడుతాను.

# ఎక్కువగా ఆవలింతలు వస్తున్నాయా? ఇవి ఎలాంటి ఆరోగ్య సమస్యలకు సంకేతమో తెలుసా?



ఆవలింతలు మనందరికీ అనుభవమే.మన శరీరంలోని సహజ ప్రక్రియలలో ఒకటి. ఇవి సాధారణంగా నిద్ర వస్తున్నప్పుడు, బోర్ కొట్టినప్పుడు, అలసట వంటివాటికి సంకేతంగా వస్తుంటాయి. ఎదుటివారు ఆవలిస్తుంటే మనకు కూడా ఆవలింతలు వస్తాయి. ఇది ఒక సహజమైన శారీరక చర్య. కానీ, ఒక్కోసారి ఎక్కువగా ఆవలింతలు రావడం వెనుక కొన్ని కారణాలు ఉంటాయి. అవేంటో తెలుసుకుందాం. ఆవలింతలు ఎందుకు వస్తాయి? ఆవలింత అనేది ఒక సహజమైన శ్వాసకోశ చర్య. ఇది సాధారణంగా నోరు తెరిచి, లోతుగా గాలి పీల్చుకుని, నెమ్మదిగా వదలడం. ఆవలింతలు రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. అయితే, తరచుగా అధికంగా ఆవలింతలు వస్తుండటం ఆరోగ్య సమస్యల గురించి సంకేతమివ్వవచ్చు. నిద్ర - అలసట: నిద్రలేమి, అలసట లేదా మగతగా ఉన్నప్పుడు ఆవలింతలు ఎక్కువగా వస్తాయి. శరీరం విశ్రాంతి తీసుకోవాలని సంకేతం చేస్తుంది. శరీరానికి తగినంత విశ్రాంతి లేనప్పుడు, మెదడు, శరీరం నెమ్మదిస్తాయి, దీనివల్ల ఆవలింతలు వస్తాయి. బోరు కొట్టడం : బోర్ కొట్టినప్పుడు లేదా నిస్తేజంగా ఉన్నప్పుడు కూడా ఆవలింతలు వస్తాయి. ఇది మెదడును ఉత్తేజపరచడానికి ఒక మార్గం. ఆవలింతలు మెదడుకు ఎక్కువ ఆక్సిజన్ ను సరఫరా చేయడానికి సహాయపడతాయి, ఇది మనల్ని మరింత అప్రమత్తంగా ఉంచుతుంది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణ: కొత్త పరిశోధనల ప్రకారం, ఆవలింతలు మెదడును చల్లబరచడానికి సహాయపడతాయి. శరీర ఉష్ణోగ్రత పెరిగినప్పుడు ఆవలింతలు వస్తాయి. ఆవలింతల ద్వారా చల్లని గాలి పీల్చడం వల్ల మెదడు ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుంది. వ్యాయామం చేసినప్పుడు లేదా వేడి వాతావరణంలో ఉన్నప్పుడు ఆవలింతలు ఎక్కువగా రావడానికి ఇది ఒక కారణం. రైలు బోగీలో ఒంటరిగా యువతి, కన్నేసిన కామాంధుడు । ఇతరులు ఆవలింతలు వేయడం చూసినప్పుడు మనకు కూడా ఆవలింతలు రావడం సహజం. ఇది సానుభూతి, సామాజిక బంధంతో ముడిపడి ఉంటుంది. ఇతరుల భావోద్వేగాలను గుర్తించడంలో, ప్రతిస్పందించడంలో మనకున్న సహజ సామర్థ్యం వల్ల ఇది జరుగుతుంది. వైద్య పరిస్థితులు: కొన్నిసార్లు, ఎక్కువగా ఆవలింతలు రావడం కొన్ని వైద్య పరిస్థితులకు సంకేతం కావచ్చు, ముఖ్యంగా ఇతర లక్షణాలు కూడా ఉంటే. కొన్ని వైద్య పరిస్థితులు ఆవలింతలను పెంచుతాయి: గుండె సమస్యలు: గుండె చుట్టూ రక్తస్రావం లేదా గుండెపోటు వంటి గుండె సమస్యలు ఉన్నప్పుడు, మెదడుకు రక్త ప్రవాహం తగ్గుతుంది. దీనివల్ల ఆవలింతలు వస్తాయి. ఒక్కోసారి మూర్ఛ వచ్చే ముందు లేదా మూర్ఛ సమయంలో కొందరికి ఆవలింతలు ఎక్కువగా వస్తాయి. మెదడు కణితులు: మెదడులో కణితులు లేదా స్ట్రోక్ కారణంగా మెదడు దెబ్బతిన్నప్పుడు ఆవలింతలు ఎక్కువగా వస్తాయి. నాడీ సంబంధిత వ్యాధిలో, మెదడు, వెన్నుపాములోని నరాల కవచం దెబ్బతింటుంది. ఇది ఆవలింతలను పెంచుతుంది. వాగస్ నాడి అనేది మెదడు నుండి శరీరంలోని అనేక భాగాలకు వెళ్లే ఒక పెద్ద నాడి. ఈ నాడి ఉద్దీపన చెందినప్పుడు ఆవలింతలు వస్తాయి. ఇది వికారం, వాంతులు మరియు గొంతు నొప్పి వంటి సమస్యలతో కూడా సంబంధం కలిగి ఉంటుంది. మందులు: కొన్ని యాంటిడిప్రెసెంట్స్, యాంటిహిస్టామైన్స్ మరియు నొప్పి నివారణ మందులు వంటి కొన్ని మందులు దుష్ప్రభావాలుగా ఆవలింతలను పెంచుతాయి. ఎప్పుడు ఆందోళన చెందాలి? సాధారణంగా ఆవలింతలు ప్రమాదకరమైనవి కావు. కానీ, మీరు తరచుగా, ఎక్కువగా ఆవలింతలు వేస్తుంటే వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం . విపరీతమైన అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ నొప్పి, గుండె దడ, తల తిరగడం, బలహీనత, శరీర భాగాలలో తిమ్మిర్లు ఈ లక్షణాలు కన్పిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

# మూడు రోజులు స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంటే ఏం జరుగుతుందో తెలుసా..?



స్మార్ట్‌ఫోన్‌లు ఆధునిక జీవితంలో ఒక ముఖ్యమైన భాగమయ్యాయి. వాటి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి, అయితే కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయి.స్మార్ట్‌ఫోన్‌లు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను కనెక్ట్ చేయడానికి సహాయపడతాయి.ఫోన్ కాల్స్, టెక్స్ట్ మెసేజ్‌లు, ఈమెయిల్‌లు, సోషల్ మీడియా ద్వారా సులభంగా ఇతరులతో సంభాషించవచ్చు. అయితే స్మార్ట్‌ఫోన్‌లకు ఎక్కువ సమయం కేటాయించడం వల్ల వ్యసనంగా మారవచ్చు. వరుసగా మూడు రోజుల పాటు దూరంగా ఉండటం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు. మానసిక ప్రశాంతత నిరంతర నోటిఫికేషన్‌లు, సోషల్ మీడియా అప్‌డేట్‌ల నుండి విముక్తి లభిస్తుంది.ఒత్తిడి, ఆందోళన స్థాయిలు తగ్గుతాయి.మనస్సు ప్రశాంతంగా, ఏకాగ్రత పెరుగుతుంది. మెరుగైన నిద్ర స్క్రీన్ నుండి వెలువడే నీలి కాంతి నిద్ర నాణ్యతను తగ్గిస్తుంది.ఫోన్‌కు దూరంగా ఉండటం వల్ల నిద్ర హార్మోన్ల ఉత్పత్తి మెరుగుపడుతుంది.గాఢమైన, ప్రశాంతమైన నిద్ర లభిస్తుంది. కంటి ఆరోగ్యం దీర్ఘకాలం స్క్రీన్ చూడటం వల్ల కళ్ళు పొడిబారడం, దృష్టి మందగించడం వంటి సమస్యలు వస్తాయి.ఫోన్‌కు దూరంగా ఉండటం వల్ల కళ్ళకు విశ్రాంతి లభిస్తుంది. కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. శారీరక ఆరోగ్యం తక్కువ కదలిక, ఎక్కువసేపు కూర్చోవడం వల్ల ఊబకాయం, గుండె సంబంధిత సమస్యలు వస్తాయి.ఫోన్‌కు దూరంగా ఉండటం వల్ల శారీరక శ్రమ పెరుగుతుంది.శరీరం చురుకుగా ఉంటుంది. !” సామాజిక సంబంధాలు ఫోన్ లేకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఎక్కువ సమయం గడపవచ్చు.వ్యక్తిగత సంబంధాలు బలపడతాయి.సంతోషంగా ఉంటారు. ఉత్పాదకత పెరుగుదల ఏకాగ్రత మెరుగుపడటం వలన పనిలో ఉత్పాదకత పెరుగుతుంది.సృజనాత్మకత పెరుగుతుంది.మానసిక ఆరోగ్యంమానసిక స్థితి మెరుగుపడుతుంది.నిరాశ, కుంగుబాటు వంటివి తగ్గుతాయి.

# ఇలా చేస్తే చాలు ..గర్భం వద్దన్నా వచ్చేస్తోంది..!

ఈ రోజుల్లో పది మంది పెళ్లయిన జంటల్లో ఇద్దరు, ముగ్గురిలో సంతానం గురించి బాధపడుతున్న వారే దర్శనం ఇస్తున్నారు. సంతానం కోసం డాక్టర్ల చుట్టూ తిరుగుతూ.. డబ్బుతో పాటు, తమ విలువైన సమయాన్ని కూడా వృథా చేసుకుంటున్నారు. చిన్న చిన్న చిట్కాలతో ఈ సంతనోత్పత్తి సమస్యకు చెక్ పెట్టవచ్చు. మనం తినే ఆహార అలవాట్లను మార్చుకుంటే ఈజీగానే గర్భం దాల్చే అవకాశాలు లేకపోలేదు. మీరు గర్భం పొందడానికి ప్రయత్నిస్తున్నట్లయితే, మీ ఆహారం మీ సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతుంది. సంతనోత్పత్తిని పెంచే ఆహారాలకు మీ ఆహారంలో ప్రాధాన్యత ఇవ్వడం వల్ల మీకు గర్భం దాల్చడానికి మరింత అవకాశం ఉంటుంది. సంతనోత్పత్తిని పెంచే ఆహారాలలో ఇవి ఉన్నాయి: ఆకుకూరలు: ఆకుకూరలు విటమిన్లు, ఖనిజాలు మరియు యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలాలు, ఇవి అండోత్సర్గం మరియు స్పెర్మ్ నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఆకుకూరలలో పాలకూర, బ్రకోలి, కాలే, మెంతులు మీ సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తాయి. పుచ్చకాయలు మీ మూడ్‌ను పెంపోందిస్తాయి. పండ్లు: పండ్లు ఫోలిక్ యాసిడ్, విటమిన్ అ మరియు యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలాలు, ఇవి గర్భస్రావం నుండి రక్షించడంలో సహాయపడతాయి. పండ్లలో నారింజ, యాపిల్, బెర్రీలు మరియు దానిమ్మపండు ఉన్నాయి. తృణధాన్యాలు: తృణధాన్యాలు ఫైబర్, మినరల్స్ మరియు విటమిన్లకు మంచి మూలాలు, ఇవి హార్మోన్లను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. తృణధాన్యాలలో బ్రౌన్ రైస్, క్వినోవా, బార్లీ మరియు గోధుమ ఉన్నాయి. ప్రోటీన్: ప్రోటీన్ అండాలు, మాంసం, చేపలు, పప్పులు మరియు గుడ్లు వంటి ఆహారాల నుండి లభిస్తుంది. ప్రోటీన్ స్పెర్మ్ ఉత్పత్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు: ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు చేపలు, బీన్స్, గింజలు మరియు నట్స్ వంటి ఆహారాల నుండి లభిస్తాయి. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు స్పెర్మ్ నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మీరు గర్భం పొందడానికి ప్రయత్నిస్తున్నట్లయితే, మీ ఆహారంలో ఈ ఆహారాలను చేర్చడం ద్వారా మీ సంతానోత్పత్తిని మెరుగుపరచడానికి మీరు చర్య తీసుకోవచ్చు. అదనంగా, ఆరోగ్యకరమైన బరువును కలిగి ఉండటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం మరియు మద్యం మరియు పొగతాగడం వంటి అలవాట్లను నివారించడం ద్వారా మీరు మీ సంతానోత్పత్తిని మెరుగుపరచవచ్చు.




# ప్రపంచంలో అత్యంత ఖరీదైన పండు ఏదో తెలుసా..?



పండ్లు మన ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. అవి విటమిన్లు, ఖనిజాలు, మరియు ఫైబర్ వంటి అవసరమైన పోషకాలను అందిస్తాయి, ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. మార్కెట్‌లో చాలా రకాల పండ్లు అందుబాటులో ఉన్నాయనే విషయం తెలిసిందే. అయితే ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పండుగా యుబారి కింగ్ మెలోన్ నిలిచింది. ఈ పండు జపాన్‌లో మాత్రమే దొరుకుతోంది. యుబారి కింగ్ పుచ్చకాయ జపాన్ లోని హ్వక్కైడో ద్వీపంలోని యుబారిలో పండించే ఒక రకమైన పుచ్చకాయ. ఇది దాని తీపి రుచి, పరిపూర్ణ ఆకారం మరియు అధిక ధరకు ప్రసిద్ధి చెందింది. యుబారి కింగ్ మెలోన్ ప్రత్యేకతలు యుబారి కింగ్ పుచ్చకాయలు గుండ్రంగా మరియు నునుపైన చర్మంతో ఉంటాయి.లోపల గుజ్జు నారింజ రంగులో మరియు చాలా తీపిగా ఉంటుంది.దీని వాసన కూడా చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది.ఈ పండును చుగెన్ (జపాన్ లో బహుమతులు ఇచ్చే సంప్రదాయం) సందర్భంగా బహుమతిగా ఇస్తారు.ఈ పుచ్చకాయ యొక్క ప్రత్యేకత ఏమిటంటే దీనిని చాలా జాగ్రత్తగా పెంచుతారు. ప్రతిరోజు ఈ పండును శుభ్రం చేస్తారు.ఈ పుచ్చకాయలు 1.5 నుండి 2 కిలోల బరువు వరకు ఉంటాయి. పుచ్చకాయను కంటాలౌప్ మరియు బర్ఫీస్ స్పైసీ కంటాలౌప్ అనే రెండు రకాల పుచ్చకాయల మిశ్రమం ద్వారా తయారు చేస్తారు.ఈ యుబారి పుచ్చకాయలు జూన్ నుండి ఆగష్టు మొదటి వారం వరకు మాత్రమే దొరుకుతాయి.2018 సంవత్సరంలో రెండు యుబారి కింగ్ పుచ్చకాయలు 3.2 మిలియన్ జపనీస్ యెన్లకు అమ్ముడయ్యాయి.2019లో ఒక జత యుబారి కింగ్ మెలోన్ 46,500 డాలర్లకు (సుమారు 35 లక్షల రూపాయలు) అమ్ముడయ్యింది. ఇవే కాకుండా ప్రపంచంలో ఖరీదైన పండ్ల జాబితాలో మియాజాకి మామిడి, రూబీ రోమన్ ద్రాక్ష, డెన్సుకే పుచ్చకాయ వంటివి ఉన్నాయి.






# రెండేళ్లైనా సమంతకు ప్రేమ తగ్గలేదు



: ఏ మాయ చేసావే సినిమాతో విపరీతమైన ఫ్యాన్స్ ను సంపాదించుకుంది సమంత. తక్కువ టైమ్ లోనే సౌత్ లోని అగ్ర హీరోలందరితో నటించి స్టార్ హీరోయిన్ గా మారిన సమంత, కెరీర్ పీక్ లో ఉన్నప్పుడే నాగచైతన్య ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. కానీ తర్వాత ఇద్దరికీ మనస్పర్థలు రావడంతో పరస్పర అంగీకారంతో విడిపోయారు. ఆ తర్వాత సమంతకు ఆరోగ్యం క్షీణించి మయోసైటిస్ అనే వ్యాధితో బాధ పడటం, ఆ వ్యాధి చికిత్స నిమిత్తం కొంత కాలం పాటూ సినిమా నుంచి బ్రేక్ తీసుకున్న సమంత ఇప్పుడు మళ్లీ తన సినిమాల వేగాన్ని పెంచుతోంది. రీసెంట్ గా అమెజాన్ ప్రైమ్ కోసం వరుణ్ ధావన్ తో కలిసి సమంత సిటాడెల్ హనీ బన్నీ చేసి మంచి రెస్పాన్స్ అందుకున్న విషయం తెలిసిందే. వెబ్ సిరీస్ అయితే వచ్చింది కానీ సమంత నుంచి సినిమా వచ్చి ఇప్పటికి రెండేళ్లవుతుంది. మామూలుగా ఇండస్ట్రీలో ఎవరైనా సరే రెగ్యులర్ గా ఆడియన్స్ కు కనిపిస్తుంటేనే వారికి ప్రేమాభిమానాలు దక్కుతుంటాయి. స్క్రీన్ పై కనిపించకపోతే ఆ ఎఫెక్ట్ ఎంతలేదన్నా వారి ఫాలోయింగ్ పై పడుతుందనేది నిజం. కానీ సమంత మాత్రం తనకు ఆ సమస్య లేదంటోంది. ఇండస్ట్రీలో చేసిన సినిమాలు హిట్టైతేనే వారికి క్రేజ్, ప్రేమ, అభిమానాలు పుష్కలంగా ఉంటాయి. కానీ తాను సినిమా చేసి రెండేళ్లయినా తనపై ఆడియన్స్ కు ఏ మాత్రం ప్రేమ తగ్గలేదని రీసెంట్ గా చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్ లో మాట్లాడుతూ సమంత ఎమోషనల్ అయింది. సౌత్ హీరోయిన్ గా కెరీర్ ను స్టార్ట్ చేసిన సమంత ఇప్పుడు నార్త్ లో కూడా తన సత్తా చాటుతోంది. ఇకపై వరుసపెట్టి సినిమాలు చేయడానికి రెడీ అవుతున్న సమంత ఓ వైపు నటిగా, మరోవైపు నిర్మాతగా కూడా దూసుకెళ్లాలని చూస్తోంది. ఆల్రెడీ సమంత నిర్మాతగా రూపొందిన శుభం సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు రీసెంట్ గా అనౌన్స్‌మెంట్ కూడా వచ్చింది. దీంతో పాటూ నందినీరెడ్డి దర్శకత్వంలో ఓ సినిమాకు సమంత గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందంటున్నారు. వీటితో పాటూ బాలీవుడ్ లో కూడా సమంత పలు ప్రాజెక్టులు చేయాలని చూస్తోంది.




# ఐపీఎల్ లో రాబిన్ హుడ్ రేంజ్ పెంచేలా.. అదిరిపోయే ప్లాన్



ఐపీఎల్ 18వ సీజన్ వచ్చేసింది. ఇక ఉదయం అంత లైఫ్ తో బిజీగా ఉండే వారు రాత్రికి మ్యాచ్ చూసేందుకు సిద్ధమవుతు ఉంటారు. ఇక క్రమంలో బాక్సాఫీస్ వద్ద ఐపీఎల్ ప్రభావం ఏ మేరకు ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. అయితే రాబిన్ హుడ్ టీమ్ మాత్రం వార్నర్ తోనే వీలైనంత ఎక్కువ బజ్ క్రియేట్ చేయాలని చూస్తోంది. అందుకే చిత్ర యూనిట్ కూడా ఆటలోకి వెళ్లి మరీ ఆడియెన్స్ మనసు దోచే ప్రయత్నం చేస్తోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఐపీఎల్ గెలిపించిన కెప్టెన్‌గా, హైదరాబాద్ అభిమానులకు ఇంటి ముద్దుబిడ్డగా మారిపోయిన ఈ ఆస్ట్రేలియన్ స్టార్ ఇప్పుడు కొత్త అవతారంలో అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. క్రికెట్ ఆడని ఈ సీజన్‌లోనూ ఆయన క్రేజ్ తగ్గలేదు. ఒకవేళ బ్యాట్ చేతిలో లేకపోయినా.. ఇప్పుడు బిగ్ స్క్రీన్ పై దూసుకొస్తున్నాడు.. అది కూడా తెలుగు సినిమాలో. వార్నర్ నటిస్తున్న నితిన్ సినిమా రాబిన్ హుడ్ ఇప్పటికే బాగానే హైప్ తెచ్చుకుంది. కానీ ఇప్పుడు ఐపీఎల్ నేపథ్యాన్ని క్యాష్ చేసుకునే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. మార్చి 23న ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌కు నితిన్, శ్రీలీలతో కలిసి వార్నర్ హాజరుకానున్నాడు. ఇది కేవలం ఒక ప్రోమోషన్ ఈవెంట్ కాదనిపిస్తోంది. ఇది ఒక క్రాస్ ఓవర్ హైప్ స్ట్రాటజీ. స్పోర్ట్స్ + సినిమా + స్టార్ కంటెంట్.. ఈ మూడు కలిస్తే ఎలా ఉంటుందో చూపించబోతున్నారు. వార్నర్ రాబిన్ హుడ్ సినిమాలో పాత్ర పోషించడం, ఆ సినిమాలో నటీనటులతో కలసి మ్యాచ్ వేదికను ప్రమోషన్ ప్లాట్‌ఫామ్‌గా వాడుకోవడం ఒక స్మార్ట్ మూవ్. ఐపీఎల్ ప్లే చేసే జట్టుకే కాదు, సినిమాలోకి కూడా ఈ క్రేజీ బ్రాండింగ్ తీసుకొస్తున్నాడు వార్నర్. ఇది వాఖీఊ అభిమానుల్లోనూ సినిమాకు ఓ ప్రత్యేక స్థానం కల్పించేలా ఉంది. ముఖ్యంగా యూత్ ఆడియన్స్ ఈ మల్టీ-డైనమిక్ ప్రమోషన్ స్టైల్‌తో సినిమాపై మరింత ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక క్రికెట్ సీజన్‌లో సినిమా విడుదల చేస్తుండటం కూడా స్ట్రాటజికల్. ఫ్యాన్స్ స్టేడియం సందడిలో ఉన్నప్పుడు వార్నర్ అనే బ్రాండ్ సినిమాతో కనెక్ట్ అవడం పెద్ద అడ్వాంటేజ్ అవుతుంది. పైగా సోషల్ మీడియాలో ఇప్పటికే వార్నర్-నితిన్-శ్రీలీల కలయికపై మెసేజ్‌లు, రీల్స్ వైరల్ అవుతున్నాయి. అటు వాఖీఊ క్రేజ్‌ని ఇటు సినిమా వైపు తిప్పేందుకు ఈ స్టంట్ పనికొచ్చేలా ఉంది. ఈ సమ్మర్ సీజన్‌లో రాబిన్ హుడ్ ఓ మాస్ ఎంటర్టైనర్‌గా నిలవాలంటే.. ఇలా కొత్తగా ఆడియన్స్‌కి దగ్గరవ్వాల్సిందే. వార్నర్ సహాయంతో వాఖీఊ క్రేజ్‌ని బలంగా ఉపయోగించుకుంటూ, సినిమాకు మరింత దారితీస్తున్నారు. మరి ఈ స్ట్రాటజీ రాబిన్ హుడ్ బాక్సాఫీస్ వద్ద ఏ రేంజ్ లో క్లిక్కవుతుందో చూడాలి.

# 2025-26 ఆ స్టార్ హీరో డైరీ ఫుల్!

కోలీవుడ్ స్టార్ కార్తీ ఫుల్ స్వింగ్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవలే 'సత్యం సుందరం'తో మంచి విజయం అందుకున్నాడు. ప్రస్తుతం రెండు సినిమాలో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతు న్నాడు. 'సర్దార్' కి సీక్వెల్ గా 'సర్దార్ -2' చేసాడు. ఇది ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది.అలాగే 'వా వాతియార్' కూడా షూటింగ్ పూర్తి చేసుకుని నిర్మాణానంతర పనుల్లో ఉంది. ఇవి గాక కార్తీ లైనప్ చూస్తే రెండేళ్ల వరకూ మరే డైరెక్టర్ కి దొరికేలా లేడు. త్వరలోనే లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'ఖైదీ -2' మొదలవుతుంది. అలాగే హెచ్ వినోధ్ దర్శకత్వంలో 'ఖాకీ' సీక్వెల్ కూడా ప్రకటించారు. 'ఖాకీ 2' టైటిల్ తో పట్టాలెక్కించాలని రెడీ అవుతున్నారు. ఇటీవలే గౌతమ్ మీనన్ తో కూడా ఓ సినిమా చేసేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఓ ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ స్టోరీ కార్తీకి నచ్చడంతో ఒకే చేసాడు. దీనిపై ఇంకా పూర్తి క్లారిటీ రావాల్సి ఉంది. పా రంజిత్, మారి సెల్వరాజ్, సుందర్. సి, శివ లాంటి స్టార్ డైరెక్టర్లు కార్తీతో సినిమాలు చేయడానికి క్యూలో ఉన్నారు. వీళ్లంతా ఇప్పటికే స్టోరీలు వినిపించారు. అయితే వారంతా వేర్వేరు సినిమాలతో బిజీగా ఉండటంతో? ఓ ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నారు. వీళ్లలో కొంత మందితే ఇప్పటికే కార్తీ సినిమాలు చేసాడు. ఆ రిలేషన్ కారణంగానే కార్తీ కూడా వాళ్లతో అవకాశం ఉన్నప్పుడల్లా సినిమాలు చేయడానికి అంతే ఆసక్తి చూపిస్తుంటాడు. వీళ్లందరితో కార్తీ సినిమాలు చేసి రిలీజ్ చేయాలంటే మరో మూడేళ్లకు పైగా సమయం పడుతుంది. 2025-26 క్యాలెండర్ కూడా ఇప్పటికే ఫుల్ అయింది. ఆ లిస్ట్ లో పై వాళ్లలో కొంత మంది దర్శకులు క్యూలో ఉన్నారు. అదీ సంగతి.



# వీరమల్లు రిలీజ్ కాదు అన్న నమ్మకంతోనే 'సింగిల్' రిలీజ్ కి రెడీ అవుతుందా?



'హరిహర వీరమల్లు' మే 9న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ కొత్త తేదీని ప్రకటించిన సంగతి తెలిసిందే. డబ్బింగ్ పనులు నిన్నటి రోజున మొదలైన నేపథ్యంలోనూ రిలీజ్ విషయాన్ని మరోసారి కన్ఫమ్ చేసారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లో మే 9న రిలీజ్ చేయడం లాంఛన మేనని ప్రేక్షకాభిమానులు సైతం బలంగా నమ్ముతున్నారు. పవన్ కళ్యాణ్ పై షూట్ చేయాల్సిన నాలుగు రోజుల పెండింగ్ చిత్రీకరణకు వచ్చే నెల మొదటి వారంలోనే డేట్లు ఇస్తున్నట్లు ప్రచారంలో ఉంది. - సినిమాల్లోకి లక్కీగా వచ్చా ఇంతకు మించి వెనుక తిప్పించుకోవడం కూడా పవన్ కు భావ్యం కాదు కాబట్టి ఎంత బిజీగా ఉన్నా? నాలుగు రోజులు ఇచ్చేయాలని ఆయన స్ట్రాంగ్ గానే కనిపిస్తున్నారు. కానీ ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే మే 9న మరో సినిమా కూడా రిలీజ్ అవుతున్నట్లు తెలుస్తోంది. శ్రీ విష్ణు కథానాయకుడిగా నటిస్తోన్న 'సింగిల్' చిత్రాన్ని మే 9న రిలీజ్ చేస్తున్నట్లు పోస్టర్ రిలీజ్ చేసారు. అయితే ఈ సినిమా నిర్మాణంలో గీతా అర్ట్స్ కూడా భాగస్వామి. అల్లు అరవింద్ ఈ సినిమాకు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇది యూత్ ఫుల్ ఎంటర్ టైనర్. శ్రీవిష్ణు సినిమాలకు యువత బాగానే కనెక్ట్ అవుతుంది. అయితే వీరమల్లు డబ్బింగ్ పనులు మొదలైన రోజునే సింగిల్ రిలీజ్ పోస్టర్ రావడం ఆసక్తికరంగా మారింది. శ్రీ విష్ణు పవన్ కళ్యాణ్ పోటీ కాదు. కానీ పోటీగా ప్లాన్ చేస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సమర్పకుడు అల్లు అరవింద్ కాబట్టి రిలీజ్ పరంగా ఎలాంటి ఢోకా ఉండదు. చేతిలో కావాల్సినన్ని థియేటర్లు ఉన్నాయి. డిస్ట్రిబ్యేషన్ వ్యవస్థ ఆయన చేతుల్లో ఉంది. కాబట్టి 'సింగిల్' కి థియేటర్ల కొరతేమి ఉండదు. కాబట్టి వీరమల్లు రిలీజ్ కి ఉన్నా? 'సింగిల్' బయపడాల్సిన పనిలేదు.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**